PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 315 | విజయవాడ, మంగళవారం 17 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 17 June 2025 | Rs

జియో సేవలపై వేలాది ఫిర్యాదులు

- సిగ్నల్ అంతరాయంపై ఆందోళన

3

కొత్త రేషన్‌కార్డులకు 1.18 లక్షల దరఖాస్తులు

- ఇప్పటిదాకా 13 వేల దరఖాస్తుల తిరస్కరణ

2

ప్రజా ఉద్యమంగా యోగా

మోడీకి మాటిచ్చాను.. సక్సెస్ కావాలి

అధికారులకు చంద్రబాబు దిశా నిర్దేశం

రాష్ట్రంలో లక్షచోట్ల... 2 కోట్ల మందికి పైగా యోగా డేలో భాగస్వామ్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

యోగాను రాష్ట్రంలో ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ నెల 21న విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా డే వేడుకలు జరుగుతుండటం, ప్రధాని హాజరుకానుండటం నేపథ్యంలో ఆ ఏర్పాట్ల పరిశీలనకు సిఎం సోమవారం విశాఖకు విచ్చేశారు . ఆర్‌కె బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లును స్వయంగా పరిశీలించారు. ఎయు సహా విశాఖలో యోగా డే జరిగే ప్రధాన ప్రాంతాలన్నింటినీ సిఎం కలియదిరిగారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని చెప్పారు. యోగా డే విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రపంచ రికార్డు సాధించాలన్న దిశగా ప్రణాళిక ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'యోగాడేను సక్సెస్ చేస్తాం అని ప్రధాని నరేంద్ర మోడీకి మాటిచ్చాను. అందరు దీనిని దృష్టిలో పెట్టుకోవాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోజువారీ సమస్యలతో అనారోగ్యం పాలవుతున్న ప్రజలు వారి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా మంచి మార్గమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి యోగా ఒక మార్గమన్నారు. వేడుకలలో భాగంగా విశాఖలో ఒక ప్రాంతంలోనే మూడు లక్షల మంది యోగా చేయనున్నారని చెప్పారు. చుట్టుపక్కల ప్రాంతాలతో కలుపుకొని మొత్తం ఐదు లక్షల మంది భాగస్వాములవుతున్నారని అన్నారు. ప్రధాని దేశ వ్యాప్తంగా లక్ష ప్రాంతాల్లో యోగా కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే లక్ష ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. వీటన్నింటిలో కలిపి సుమారు రెండు కోట్ల మంది పాల్గొంటున్నారన్నారు.

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్లా 17 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న 25 లక్షల మందికి సర్టిఫికెట్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రావలసిందిగా గిన్నిస్ రికార్డు వారికి ఇప్పటికే సమాచారం ఇచ్చామన్నారు. మొత్తం 326 కంపార్టుమెంట్‌లను ఏర్పాటు చేశామని, ఒక్కోదానిలో వెయ్యి మంది చొప్పున యోగా చేయనున్నారని, ప్రతిచోటా వలంటీర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల నుంచి 25 వేల మంది గిరిజన విద్యార్థులను ఈ కార్యక్రమంలో పాల్గొన్నేందుకు విశాఖకు తీసుకురానున్నామన్నారు. ఇండియన్ నేవీ వారు 11 భారీ నౌకలలో యోగాసనాలు వేసి కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నట్టు తెలిపారు. బీచ్ రోడ్డులో యోగా వేడుకలకు ఏదన్నా వాతావరణ సమస్య ఏర్పడితే ప్రధాన వేదికను ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌కు మార్చేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. సిఎం వెంట మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్థసారధి, అనిత, యోగాంధ్ర - 2025 నోడల్ అధికారి ఎమ్‌టి.కృష్ణబాబు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ ఉన్నారు.

విశాఖ బీచ్ రోడ్డులో యోగా డే ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

రెండు దశల్లో జనగణన

- మొదటి దశ 2026 అక్టోబర్ 1 నాటికి పూర్తి
- రెండో దశ 2027 మార్చి 1 నాటికి పూర్తి
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎంతోకాలంగా వాయిదాపడుతూ వస్తున్న జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది ప్రారంభం కానున్నది. దేశంలో 16 ఏళ్ల తరువాత చేపడుతున్న ఈ జనగణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను సోమవారం కేంద్ర హోం శాఖ ఈ గెజిట్‌ను విడుదల చేసింది. రెండు దశల్లో ఈ ప్రక్రియ జరగనుంది. ఈ జనగణన మొత్తంగా 16వదికాగా, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన కానుంది. 2027 మార్చి 1 నాటికి ఇది పూర్తి కానుంది. తొలి దశలో భాగంగా హిమాలయ ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో 2026 అక్టోబర్ 1 నాటికి, రెండో దశలో భాగంగా 2027 మార్చి 1 నుంచి దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో జన గణన పూర్తి కానుంది. ఈసారి జనగణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుందని కేంద్ర హెూంశాఖ మిగతా 7లో

మా ఊరిలోనే బడి

- పాఠశాలల తరలింపునకు నిరసనగా పలుచోట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన

3

అంగన్‌వాడీలకు, ఆశాలకు అన్ని సంక్షేమ పథకాలూ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద సోమవారం ఆందోళనలు జరిగాయి. కాకినాడలో నిర్వహించిన ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి పాల్గొన్నారు. వార్త 2లో

'తల్లికి వందనం'లో అంగన్‌వాడీ, ఆశాలకు కోత

ఆదాయ పరిమితిలోపే ఉన్నా అమలు చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకంలో అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లకు, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం కోత విధించింది. రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆదాయ పరిమితికి లోబడే ఉన్నా అమలు చేయకుండా స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న తల్లులను నిరాశ పరిచింది. రాష్ట్రంలో ఆశా, అంగన్‌వాడీలు కలిపి సుమారు 1.50 లక్షల మంది ఉన్నారు. వీరంతా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలే. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి నెలకు ఆదాయ పరిమితి గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలుగా విధించింది.

అయితే అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.11,500, వర్కర్లకు రూ.7000, ఆశా వర్కర్లకు రూ.10 వేలు చొప్పున మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వేతనం కింద అందిస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ పరిమితి చూసుకున్నా ఎక్కువ శాతం మంది ఈ పథకానికి అర్హులుగా ఉన్నారు. కానీ సిఎఫ్ఎంఎస్ నుంచి వేతనం పొందుతున్నారనే పేరుతో అనర్హులను చేసి, ఈ పథకం అమలు కాకుండా కోతలు విధించింది. గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఈ పథకాన్ని అమలు చేయాలని ఉత్తర్వులు విడుదల చేసింది. వీటిని సైతం లెక్కలోకి తీసుకోకుండా కోతలు వైపు మొగ్గుచూపింది. రాష్ట్రంలో రూ.11,500 వేతనం పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు సుమారు 48 వేల మంది, రూ.7 వేలు తీసుకుంటున్న అంగన్‌వాడీ వర్కర్లు సుమారు 56 వేల మంది, రూ.10 వేలు వేతనం తీసుకుంటున్న ఆశా వర్కర్లు సుమారు 40 వేల మంది ఉన్నారు.

ఇచ్చిన హామీ అమలు చేయరా?

వాస్తవానికి పెరిగిన నిత్యావసర ధరలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు పేదలతో పాటు మధ్యతరగతి ప్రజలకు కూడా భారంగా మారాయి. నెలకు రూ.25 వేలు వేతనం పొందుతున్న చిరుద్యోగులు సైతం ఈ ఖర్చులతో కుటుంబాన్ని నడపలేకపోతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మాత్రం సంక్షేమ పథకాల విషయంలో ఇంకా పట్టణాల్లో నెలకు రూ.12 వేలు, గ్రామాల్లో రూ.10 వేలు అంటూ పాత లెక్కలనే చెబుతోంది. ఈ ఆదాయ పరిమితిని పెంచాలని ప్రజలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఆదాయ పరిమితి రూ.25 వేలులోపు ఉన్నవారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ కూడా ఇచ్చింది. ఆచరణలోకి వచ్చేలోపు గత నిబంధనలనే పాటిస్తున్నామంటూ సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తోంది. ప్రతిపక్షంలో విద్యుత్ వినియోగాన్ని సంక్షేమ పథకాలకు అమలు చేయడాన్ని తప్పుపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం గమనార్హం.

జి 7 సమావేశాల ప్రారంభం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి మాట్లాడుతున్న అతిథ్య కెనడా ప్రధాని మార్క్ కార్నే. చిత్రంలో కెనడా, అమెరికా అధికారులు

ఉద్రిక్తతలపైనే చర్చ!

- జి7 శిఖరాగ్ర సమావేశం ప్రారంభం
- పశ్చిమాసియా పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లే ప్రధానాంశాలు
- ప్రధాని మోడీ సహా ఒక్కొక్కరుగా చేరుకుంటున్న నేతలు
- ట్రంప్‌తో కెనడా ప్రధాని భేటీ

నికోసియా : ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు, మరోవైపు గాజాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధం, రష్యా, ఉక్రెయిన్ దాడులు ఇలా పశ్చిమాసియా వ్యాప్తంగా ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న వేళ జి-7 పూర్తి స్థాయి సదస్సు సోమవారం ఆరంభమైంది. ఈ పరిస్థితుల్లో పశ్చిమాసియా పరిణామాలు, మరోవైపు చైనా, కెనడా సహా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లపై సదస్సులో ప్రధానంగా చర్చ జరుగుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ళపై కూడా చర్చ జరగనుంది. ఈ ఏడాది చర్చల అనంతరం జి-7 దేశాల నేతల సంయుక్త డిక్లరేషన్ లేదు. ఈసారి సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రధాని మోడీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హాజరవుతున్నారు. సైప్రస్‌లో పర్యటన మిగతా 7లో

వర్గ, ప్రజాపోరాటాలను ఉధృతం చేయండి

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్పొరేట్, మతోన్మాద కూటమి నాయకత్వంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వర్గ, ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపునిచ్చారు. రెండురోజులపాటు విజయవాడలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని కూడా మత విభజనలను, ఉద్రికత్తలను పెంచడానికి సంఘ్ పరివార్ శక్తులు అనేక ప్రయత్నాలు చేశాయన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం, మత విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని తెలిపారు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సింధూర్ విషయంలో అమెరికా అధ్యక్షుడి పాత్రతో కాల్పుల విరమణ జరిగిందన్న సమాచారం భారతీయులు జీర్ణించుకోలేకపోయారని తెలిపారు. దీనిపై పూర్తి వాస్తవాలు చెప్పేందుకు ప్రత్యేక పార్లమెంటు నిర్వహించడానికి మోడీ సర్కార్ నిరాకరిస్తోందన్నారు.

పాలస్తీనా గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంతోపాటు ఇరాన్‌పై ఘోరమైన దాడికి పాల్పడుతున్నా ప్రశ్నించగల సత్తా విశ్వగురుకి లేకుండా పోయిందని విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయిల్‌తో సైనిక, భద్రతా సంబంధాల ను తెంచుకోవాలని కోరారు. బిజెపి పాలనలో రాజ్యాంగ మౌలిక స్వరూపంపైన, పునాదులపైన ఉద్దేశపూర్వకంగా దాడి జరుగుతోందని, ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామికవాదులు అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు.

భారతదేశం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందంటూ అదేపనిగా ఊదరగొడుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజల వాస్తవ పరిస్థితులను బయట పెట్టాలని అన్నారు. పెరుగుతున్న అసమానతలు, కార్మికుల జీవనోపాధి, సంక్షోభం వంటి వాస్తవిక అంశాను వెలుగులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రమాదకరమైన కేంద్ర ప్రభుత్వ విధానాలకు వంతపాడుతూ లౌకిక ప్రజాస్వామ్య, ఫెడరల్ వ్యవస్థలకు రాష్ట్ర ప్రయోజనాలకు హాని చేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు యు వాసుకి, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి, కె లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న బివి రాఘవులు, వేదికపై యు వాసుకి, వి శ్రీనివాసరావు, ఎవి నాగేశ్వరరావు

కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవలు రద్దు

బెంగళూరు : కర్ణాటక హైకోర్టు శుక్రవారం ఇచ్చిన ఆదేశాలతో ఆ రాష్ట్రంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం నుంచి ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు తమ సేవలను నిలిపివేశాయి. హైకోర్టు ఆదేశాలతో తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ర్యాపిడో వెల్లడించింది. సేవలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని పేర్కొంది. బైక్ ట్యాక్సీ సేవలను ఉబర్ మోటో కొరియర్ కింద మార్చింది. మరో అగ్రిగేటర్ ఓలా తన యాప్‌లో బైక్ ట్యాక్సీ ఆప్షన్‌ను తొలగించింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటే కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయడంతో డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. జూన్ 20లోగా దీనిపై తమ స్పందన తెలుపాలని కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేయగా.. తాత్కాలికంగా బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. దీంతో గిగా వర్కర్లు తమ ఉపాధిని కోల్పోయారు.

రోడ్డెక్కిన మామిడి రైతులు

- పర్మిట్ల ఆలస్యంపై ఆగ్రహం
- జాతీయ రహదారిపై నిరసన

ప్రజాశక్తి - బంగారుపాళ్యం, జీడీనెల్లూరు

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నలగాంపల్లిలోని సన్‌గోల్డ్ గుజ్జు పరిశ్రమ ముందు రైతులు ఆందోళన చేపట్టారు. టోకెన్ల కోసం క్యూలైన్లలో గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం మామిడి పర్మిట్ల కోసం గుజ్జు పరిశ్రమను ఆశ్రయిస్తే సోమవారం పర్మిట్లు మంజూరు చేస్తామని యాజమాన్యం తెలిపిందన్నారు. సోమవారం తమ పంటను తీసుకుని పరిశ్రమ వద్దకు వచ్చినా నిర్వాహకులు పట్టించుకోకపోవడం లేదన్నారు. తోతాపురి రకం టన్ను రూ. ఎనిమిది వేలకు కొనుగోలు చేయాలని నిర్ణయిస్తే రూ. నాలుగైదు వేలకు మించి కొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటల్లో కళ్లేదుటే మామిడికాయలు రాలిపోతున్నాయని కన్నీంటి పర్యంతమయ్యారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మామిడి రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు తూకం వేసే ర్యాంపుల వద్ద తీవ్రస్థాయిలో దగా జరుగుతోందన్నారు. బంగారుపాళ్యం సిఐ కత్తి శ్రీనివాసులు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు.

జీడీనెల్లూరు మండలం 100 గొల్లపల్లి గ్రామంలోని జైన్ మామిడి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద మామిడికాయల లోడ్‌తో వందలాది ట్రాక్టర్లు చేరుకున్నాయి. పర్మిట్లు లేకుండా ముందస్తు వచ్చిన వారి నుంచి మామిడి కొనుగోలు చేస్తామని యాజమాన్యం ప్రకటించడంతో పెద్దసంఖ్యలో వాహనాలు ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నాయి. చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారిపై తిండీతిప్పలు లేకుండా రైతులు నిరీక్షిస్తున్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని మామిడి రైతు సంక్షేమ సంఘం కన్వీనర్ శంకరన్ డిమాండ్ చేశారు.

చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

శ్రీహరికోటలో హై అలర్ట్

- అపరిచిత వ్యక్తి ప్రవేశించాడని ఫోన్ కాల్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

శ్రీహరికోటలోకి అనుమానిత వ్యక్తి ప్రవేశించాడని అపరిచిత వ్యక్తి ఫోన్ చేయడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి షార్‌లో కూంబింగ్ చేపట్టారు. చెన్నై స్టేట్ పోలీస్ సెక్యూరిటీ కంట్రోల్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి షార్ కేంద్రంలోకి అనుమానితుడు ప్రవేశించాడని తెలిపారు. దీంతో చెన్నై పోలీసులు నాయుడుపేట డిఎస్‌పికి సమాచారమిచ్చారు. రాష్ట్ర పోలీసులు, సిఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది కలిసి ఆదివారం అర్ధరాత్రి నుంచి షార్‌లో అణువణువూ తనిఖీలు చేపట్టారు. సముద్ర మార్గంలోనూ తీరరక్షణ దళాలు తనిఖీలు చేపట్టాయి. ప్రస్తుతానికి ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులూ కనిపించలేదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ ఎటువంటి లోపం లేకుండా చూసేందుకు షార్ ప్రాంతం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశామని చెప్పారు. ఫోన్‌కాల్ ఆకతాయి చేసినట్లు భద్రతా బలగాలు తేల్చిచెప్పాయి.

ఉపాధ్యాయ బదిలీలు పూర్తి

- 67,732 మందికి స్థాన చలనం
- 4,477 మందికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయ్యాయి. మే 21 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ ముగిసిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం), స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఎ), భాషా పండితులు (ఎల్‌పి), వ్యాయామ ఉపాధ్యాయులు (పిఇటి), సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటి)కు బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని ప్రకటిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా 67,732 మంది ఉపాధ్యా యులు బదిలీ కాగా, 4,477 మంది ఉద్యోగోన్నతులు పొందినట్లు వెల్లడించారు. ముగిసిన బదిలీలు, ఉద్యోగోన్నతులపై ఏవైనా అభ్యంతరాలుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన జిల్లా, జోనల్ స్థాయి 'సమస్యల పరిష్కార కమిటీ'ని ఉపాధ్యా యులు సంప్రదించవచ్చునని తెలిపారు. తగిన ఆధా రాలతో అభ్యంతరాలను కమిటీకి సమర్పించాలని సూచించారు. వీటిని కమిటీలు క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారాలను అందిస్తాయని వెల్లడించారు.

విభాగం	బదిలీఅయిన సంఖ్య	ఉద్యోగోన్నతుల సంఖ్య
గ్రేడ్-2 హెచ్ఎం	1494	1,375
మోడల్ ప్రైమరీ హెచ్ఎం	5,717	1,592
ఎస్ఎ	27,804	1,510
ఎస్‌జిటి	31,174	0
ఎల్‌పి	1,199	0
పిఇటి	344	0

ఎగుమతుల్లో డీలా

- 21.88 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు
- మేలో 2.17 శాతం పతనం

3

సెర్ప్‌కు 25 ఏళ్లు

- ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సరిగ్గా 25 ఏళ్ల క్రితం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామీణ మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయన ప్రోత్సాహం వల్లే 89 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు సంవత్సరంలో రూ.లక్ష కోట్ల ఆర్థిక నిర్వహణ సమర్థవంతంగా చేయగలుగుతున్నారని తెలిపారు. దీనిని ఆధారం చేసుకునే కేంద్రం 2009లో జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకానికి నాంది పలికిందని తెలిపారు. సిఎం చంద్రబాబు కృషి వల్లే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని మంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉద్యోగులకు సిఎం అభినందన

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రస్థానం ప్రారంభమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో ఇదేరోజున ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు గ్రామంలో 'వెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సోమవారం పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల ఆర్థికాభివృద్ధిని సాధించడమే ఆనాటి ప్రాజెక్టు లక్ష్యమన్నారు. అది కాలక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థగా రూపాంతరం చెందినట్లు వెల్లడించారు.

'తల్లికి వందనం'తో ప్రతిఇంటా సంబరాలు

- టిడిపి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకం వైసిపికి మరణశాసనం అని టిడిపి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం అమలుతో ప్రతి ఇంట్లో సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడితో ఐదేళ్లు రూ.24 వేలకోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.10,091 కోట్లు ఖర్చు చేసిందన్నారు. చెప్పిన ప్రకారం ఏడాదిలోనే సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయడంతో వైసిపి నేతల్లో వణుకు మొదలైందన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికీ రూ.13 వేలు చొప్పున తల్లికి వందనం కింద అందిస్తున్నామని ఎపి బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ మరో సమావేశంలో అన్నారు. రూ.2 వేలను పాఠశాల సౌకర్యాలు, విద్యాకమిటీల కోసం కూటమి ప్రభుత్వం ఉపయోగిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం చెల్లించకుండా ఉన్న రూ.3,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తాము తీరుస్తున్నామని తెలిపారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల బ్యాగ్ బరువును తగ్గించేందుకు మంత్రి లోకేష్ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

డిజైన్ పోటీల పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంప్రదాయ హస్త కళలు, నేత వృత్తులకు ఆధునిక రూపమిచ్చే ఉద్దేశంతో ఆప్కో, లేపాక్షి సంస్థల సంయుక్త ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థల ఎమ్‌డి విశ్వ మనోహర్ తెలిపారు. విజయవాడలోని ఆప్కో రాష్ట్ర కార్యాలయంలో ఇందుకు సంబంధించి పోస్టరును ఆయన సోమవారం విడుదల చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడి) ఈ పోటీల్లో భాగస్వామిగా ఉందన్నారు. ప్రముఖ హస్తకళలుగా గుర్తింపు పొందిన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి ప్రింట్లు, లెదర్ పపెట్రీ, ఉడ్ కార్వింగ్‌లు, నేత కళల ఆధారంగా నూతనంగా రూపొందించిన వస్త్రాలు, సూక్ష్మ జ్ఞాపికల విభాగంలో నూతనత్వం ఉట్టిపడేలా డిజైన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు 18 ఏళ్లు పైబడిన వయసు ఉండి రాష్ట్రానికి చెందిన కళాకారులు, నేతన్నలు, డిజైనర్లు, విద్యార్థులు పాల్గొవచ్చన్నారు. ప్రతి విభాగంలో 3 బహుమతులను ప్రకటిస్తారన్నారు. మొదటి బహుమతికి రూ.25 వేలు, రెండో బహుమతికి రూ.15 వేలు, మూడో బహుమతికి రూ.10 వేలు నగదు అందజేస్తారని తెలిపారు. మొత్తం బహుమతుల విలువ రూ.5 లక్షలుగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొనేవారు, తమ నమూనాలను ఈ నెల 17 నుంచి జులై 16వ తేదీలోపు సమీపంలోని లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో అందించాలన్నారు. ఇతర సమాచారం కోసం https://lepakshi-handicrafts.gov.in లేపాక్షి వెబ్‌సైట్, https://www.apcofabrics.com ఆప్కో వెబ్‌సైట్‌లను సందర్శించాల్సిందిగా కోరారు.

కొత్త రేషన్‌కార్డులకు 1.18 లక్షల దరఖాస్తులు

- ఇప్పటిదాకా 13 వేల దరఖాస్తుల తిరస్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం 1,18,479 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటిలో సోమవారం నాటికి రాష్ట్ర ప్రభుత్వం 51,075 దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. వీరికి త్వరలోనే కార్డులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అదే సమయంలో వివిధ కారణాలతో 12,955 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఇకెవైసితో లింకు చేసి, ప్రతి దరఖాస్తును పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ ప్రక్రియ అధికారికంగా గత నెలలోనే ప్రారంభమైంది. కొత్త రేషన్‌కార్డులతో పాటు, పాత కార్డుల్లో పేర్లలో తప్పులు, కార్డు విభజన చేయడం, ఆధార్‌లో తప్పుల సవరణ, రేషన్ కార్డులో అదనంగా పేర్లు చేర్చడం, అడ్రస్

మార్పు, కొత్త రేషన్ కార్డులకు దరకాస్తులు, రేషన్ కార్డుల సరెండర్ ఇలా వివిధ అవసరాల కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు కోరిన విషయం తెలిసిందే. వీటన్నింటికి కలిపి 11,65,073 దరకాస్తులు ప్రభుత్వానికి అందినట్లు ఎపి సేవా సర్వీసెస్ డ్యాష్‌బోర్డులో పేర్కొన్నారు. రేషన్ కార్డును విభజించాలంటూ 1,04,562 దరకాస్తులు, రేషన్‌కార్డుల్లో అదనంగా పేర్లు చేర్చాలంటూ 8,58,089 దరకాస్తులు ప్రభుత్వానికి అందాయి.

చౌక ధరల దుకాణాల ద్వారా 89.64 శాతం రేషన్ పంపిణీ :

టిడిపి కూటమి ప్రభుత్వం ఎండియూ వాహనాలకు స్వస్తి చెప్పి జూన్ 1నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 1నుంచి 15వ తేదీ వరకు చౌక ధరల దుకాణాల ద్వారా 1,31,07,501 రేషన్ కార్డుదారులకు (89.64శాతం) రేషన్‌ను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. వికలాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు వారి ఇళ్లవద్దకే రేషన్ సరుకులను డీలర్ల ద్వారా చేరుస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆ పని అన్ని చోట్ల సక్రమంగా జరగలేదని సమాచారం.

'స్మార్ట్ కార్డులు' మరింత జాప్యం

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డు దారులకు నూతనంగా ఎటిఎం కార్డు తరహాలో "స్మార్ట్ రేషన్ కార్డులు" ఈనెల 8న పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఆలస్యం కావచ్చుని సమాచారం. ఎలాగూ కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన జరుగుతుండటంతో ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత పాత, కొత్త కార్డుదారులకు కలిపి ఒకేసారి స్మార్ట్ కార్డులు పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

తిరుపతి పద్మావతి అతిథి గృహంలో ఢిల్లీ ఎస్‌వి కళాశాల గవర్నింగ్ బాడీ సమావేశం

టిటిడి ఢిల్లీ ఎస్‌వి కళాశాలలో వృత్తిపరమైన కోర్సులు

- ఛైర్మన్ బిఆర్.నాయుడు ప్రతిపాదన

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ప్రతిష్ట మరింత పెంచేలా ఢిల్లీ ఎస్‌వి కళాశాలలో వృత్తిపరమైన కోర్సులను ప్రవేశపెట్టాలని గవర్నింగ్ బాడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు సూచించారు. తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గృహంలో టిటిడి ఇఒ జె శ్యామలరావు, గవర్నింగ్ బాడీ సభ్యులతో సోమవారం 155వ సమావేశం జరిగింది. ఎస్‌వి కళాశాల గవర్నింగ్ బాడీ ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు ఎంపికయ్యారు. శ్రీ వెంకటేశ్వర కళాశాలలో మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, అడ్మిషన్ల కోటాలో తెలుగు విద్యార్థులకు ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాది వైపున్న టిటిడి ఆలయాల్లో, ఢిల్లీలోని ఎస్‌వి కళాశాలలో ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా ఇంజనీరింగ్ ఇఇ విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు ఉపాధికి అవకాశం ఉన్న వృత్తిపరమైన కోర్సులను ప్రవేశ పెట్టాలన్నారు. కాలం చెల్లిన భవనాల స్థానంలో భవనాల పునర్నిర్మాణం, ఆడిటోరియం మరమ్మతులు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీతో కళాశాల ప్రవేశంలో మరింత ఆకర్షణీయంగా ఉండేలా మార్పులు చేర్పులు చేపట్టాలని చెప్పారు. ప్రిన్సిపల్ డా వర్షుల రవి కళాశాలకు సంబంధించిన పలు అంశాలను టిటిడి ఛైర్మన్, ఇఒల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న గవర్నింగ్ బాడీ సమావేశం నాటికి కళాశాల అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలని అధికారులను ఛైర్మన్ కోరారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు డాక్టర్ పనబాక లక్ష్మీ, ఎస్ నరేష్ కుమార్, ఎండోమెంట్ కమీషనర్ కె రామచంద్ర మోహన్, ఎఫ్ఎ అండ్ సిఎఒ ఒ బాలాజీ, సిఇ టివి సత్యనారాయణ, టిటిడి డిఇఒ వెంకట సునీల్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పులవర్తి సత్యదేవ్..?

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దళిత బాలికను నమ్మించి మోసం చేసిన పులవర్తి సత్యదేవ్‌ను రాజమహేంద్రవరం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన బాలికను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అనుచరుడు పులవర్తి సత్యదేవ్ ప్రేమ పేరుతో మోసం చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా ఈ విషయమై బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యులు న్యాయం కోసం పోరాడుతున్నారు. నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు చర్చల పేరుతో కేసును తాత్సారం చేశారు. మరోవైపు అధికార పార్టీ నేతలు డబ్బులిచ్చి రాజీ చేసే ప్రయత్నం చేశారు. కాని బాలిక, ఆమె కుటుంబం ఎలాంటి ఒత్తిళ్లకు లొంగలేదు. సత్యదేవ్‌తో వివాహం చేయాలని స్పష్టం చేసింది. అప్పటి నుంచి సత్యదేవ్ పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అయినా స్పందన కరువవ్వడంతో న్యాయం చేయాలని పోలీసుల వద్ద ఆందోళనకు దిగారు. దీంతో ఎట్టకేలకు నిందితునిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో నిందితుడు సోమవారం పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. అయితే పోలీసు అధికారుల దీన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

పేర్ని నానికి అరెస్ట్ వారెంట్ జారీ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : మాజీ మంత్రి, వైసిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు పేర్ని వెంకటేశ్వరరావు (నాని)కు కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. 2019లో టిడిపి కార్యకర్త చందు శ్రీహర్షపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పేర్ని నాని సాక్షిగా ఉన్నారు. ఈ కేసులో కోర్టు వాయిదాలకు వరుసగా హాజరు కాకపోవడంతో ఆయనకు మచిలీపట్నం కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆయనను కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం కేసు విచారణను సెప్టెంబర్ 19వ తేదీకి వాయిదా వేసింది.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయండి

- ముఖ్యమంత్రికి వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే ఇడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం విజయవాడలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఆ నిర్ణయం మేరకు రాసిన లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని లేఖలో ఆయన పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి, 15వ ఆర్థిక సంఘం రెండో విడతలో ఐదు నెలల కిందట ఇచ్చిన రూ.1,121 కోట్లను పంచాయతీలకు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పంచాయతీలకు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిలిచిపోయాయని, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేక పోతున్నామని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనేక జిల్లాల్లో ధర్నాలకు పిలుపు ఇస్తున్నారని, ఎన్నికల ముందు కూటమి తరుపున చేసిన వాగ్దానంతో స్థానిక సంస్థలకు ఊపిరి వస్తుందని భావిస్తున్న తరుణంలో పంచాయతీలకు నిధుల విడుదలలో జరుగు తున్న తీవ్ర జాప్యం గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కుంటు పడుతున్నాయని పేర్కొన్నారు. గత వైసిపి సర్కారు గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, సర్పంచులు పార్టీలకు అతీతంగా తీవ్ర ఆందోళనలతో ఉన్నారని పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు కుంటుపడ్డాయని వివరించారు. దీనిపై జోక్యం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1121 కోట్లను తక్షణం గ్రామ పంచాయతీలకు స్థానిక సంస్థలకు బదిలీ చేయాలని కోరారు.

చిరుద్యోగులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

చిరుద్యోగులకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని కోరుతూ మరో లేఖను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రాశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నెలకు రూ.25 వేలులోపు ఆదాయం ఉండేవారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించిన విషయాన్ని ఈ లేఖలో ఆయన గుర్తుచేశారు. . రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తున్నామని ప్రకటించారని, అనేక మంది తల్లులకు అకౌంట్స్‌లో రూ.13 వేలు చొప్పున వేశారని తెలిపారు. ఈ జిఓలో పారిశుధ్య కార్మికులకు ఇస్తామని చెప్పినప్పటికీ ట్రాక్ ఓపెన్ కావడం లేదని నిరకారిస్తున్నారని తెలిపారు. అతి తక్కువ ఆదాయాలు వస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు తదితరులకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో వారికి అమలు చేయడం లేదని తెలిపారు. కేవలం సిఎఫ్ఎంఎస్‌లో వేతనాలు తీసుకున్నంత మాత్రాన ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వీరిలో అనేక మందికి రూ.10 వేలు అంతకన్నా తక్కువ వేతనం వచ్చేవారేనని వివరించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.25 వేలు ఆదాయాలు వస్తున్నాయని, అంగన్‌వాడీలకు, వర్కర్లుకు రూ.11,500 హెల్పర్లకు రూ.7500, ఆశాలకు రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే విధానాన్ని తొలగించి గ్రామాల్లో రూ.20 వేలు పట్టణాల్లో నెలకు రూ.25 వేల లోపు ఆదాయం వచ్చేవారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. జిఓలో పేర్కొన్న విధంగా పారిశుధ్య కార్మికులకు వెంటనే తల్లికి వందన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని, సాధికార సర్వేలో చూపిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి అన్న పదాన్ని తీసివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీలు ఆందోళనలు చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడారు. చిరుద్యోగులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల ముందు టిడిపి కూటమి పెద్దలు హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల పిల్లలకు తల్లికి వందనం డబ్బులు వేయలేదని, భర్త చనిపోయినా వితంతు పింఛను ఇవ్వడం లేదని, ఇంట్లో వృద్ధులు, వికలాంగులు ఉంటే వారికి కూడా పింఛను ఇవ్వడం లేదని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద, రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, కాట్రేనికోన, ముమ్మిడివరంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. విజయనగరం కలెక్టరేట్ ఎదుట వద్ద ధర్నా చేశారు. చీపురుపల్లి, డెంకాడ, శృంగవరపుకోట, వేపాడ, కొత్తవలస, బొబ్బిలి, బాడంగి మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా కర్నూలు, చిప్పగిరి, ఆదోని, మంత్రాలయం, కౌతాళం, ఆస్పరి, దేవనకొండ, కోడుమూరులో తహశీల్దార్ కార్యాయాల ముందు ధర్నాలు చేపట్టి వినతిపత్రాలు అందజేశారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి వినతిపత్రం అందజేశారు. అల్లూరి జిల్లా చింతూరు ఐటిడిఎ ఎదుట నిరసన తెలిపారు.

సజ్జల పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి రాజధాని.. సంకర జాతి.. అంటూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ వాయిదా పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన తాడేపల్లి పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఆదేశాలు వెలువరించారు. తొలుత సజ్జల తరపున న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్ రెడ్డి వాదించారు. డిజిపికి డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తనపై ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోవద్దంటూ హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ ఉత్తర్వులను కాలరాసేందుకు ఇప్పుడు కంభంపాటి శిరీష అనే మహిళతో ఫిర్యాదు చేయించారన్నారు. అలాగే పోలీసుల తరపున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ ప్రతివాదన చేస్తూ, సజ్జలపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదన్నారు. పోలీసులు పూర్తి వివరాలు నివేదించాలని ఆదేశించిన హైకోర్టు విచారణ ఈ నెల 18కి వాయిదా వేసింది.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకూ తల్లికి వందనం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వర్తింపజేసిన విధంగానే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకూ తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లికి వందనం పథకం అమలు కోసం జారీ చేసిన జిఓ ఎంఎస్ నెంబరు 26లో పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా అమలవుతుందని పేర్కొన్నారన్నారు. ఆచరణలో పారిశుధ్య కార్మికుల అకౌంట్లలో రూ.15 వేలు పడలేదని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిందన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, షరతులు లేకుండా మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు కోసం ఇప్పటికే రాష్ట్ర సిఎం, మున్సిపల్‌శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎంయులకు లేఖలు రాసిందన్నారు. ఈ నెల 18న మున్సిపల్ పట్టణాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, 19న బైక్ ర్యాలీలు, 23న కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మున్సిపల్ స్టేట్ కమిషనరు స్పందించి జిఓఎంఎస్ నెంబరు 26 ప్రకారం పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితి లేకుండా తల్లికి వందనం అమలయ్యేట్లు ఆద శాలు జారీ చేశారన్నారు. ఆదాయ పరిమితి ఒక్కటే కాకుండా కరెంటు బిల్లులు 300 యూనిట్లు దాటితే తల్లికి వందనం అమలు కాదని, అది కూడా మిన హాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గొడుగులతో చేపట్టిన నిరసనలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామారావు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపేంత వరకూ పోరాటం

- గొడుగులతో నిరసన కొనసాగించిన ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపేంత వరకూ పోరాటం కొనసాగుతుందని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్ రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1586వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. ఇటీవల కూలిపోయిన దీక్షా శిబిరం టెంట్ పునర్నిర్మాణానికి ఉక్కు యాజమాన్యం, ప్రభుత్వం, పోలీసులు అడ్డంకులు సృష్టించినప్పటికీ వారు పోరాటాన్ని ఆపలేదు. అదే ప్రదేశంలో ఎండలో గొడుగులు వేసుకుని దీక్ష కొనసాగించారు. వారి పోరాటాన్ని రామారావు అభినందించారు. ప్లాంట్‌లో కార్మికులు ఎక్కువుగా ఉన్నారని, సుమారు ఆరు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని యాజమాన్యం అబద్ధాలు చెబుతుంటే, కార్మికులు పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారంటూ స్థానికంగా కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆ వైఖరులను మానుకోకుంటే రానున్న కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్లాంట్‌లో ఇటీవల 3500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించి వారి కుటుంబాలను వీధులపాలు చేయడం దారుణమన్నారు. ఎప్పటి నుంచో పనిచేస్తున్నవారిని అన్యాయంగా తొలగించి గడిచిన వారం రోజుల్లో సుమారు 400 మందికిపైగా కొత్త కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. నూతన నియామకాలను ఆపి, తొలగించిన వారిందరినీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ నెల 21న విశాఖకు వస్తున్న ప్రధాని మోడీతో సిఎం చంద్రబాబు మాట్లాడి స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటింపజేయాలని కోరారు. కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, ఉక్కు నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో యూనియన్ నాయకులు కె సత్యనారాయణ, పి భానుమూర్తి, ఆర్ వెంకటరావు, మహేష్, దుర్గాప్రసాద్, సూరిబాబు పాల్గొన్నారు.

పొదిలిలో గాయపడిన వారిపై కేసులు

- వైసిపి నాయకులు కాకుమాను రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనలో పక్కా ప్రణాళిక ప్రకారమే టిడిపి నాయకులు రాళ్లదాడి చేశారని, గాయపడిన వైసిపి నాయకులపై ఎదురు కేసులు పెట్టించారని వైసిపి పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ కాన్వాయ్‌పై టిడిపి నాయకులు దాడి చేశారని ఆరోపించారు. కూటమి ఏడాది పాలనకు వ్యతిరేకంగా ప్రజలు జగన్ పక్షాన నిలవడాన్ని జీర్ణించుకోలేక, కడుపుమంటతో పోలీసులను ఉసిగొల్పి అక్రమ అరెస్టులకు తెగబడుతోందని అన్నారు. జెడ్‌ప్లస్ కేటగిరి భద్రత ఉన్న జగన్ కాన్వాయ్‌లోకి అరాచక శక్తులు ఎలా చొరబడ్డాయనే అనుమానం అందరిలోనూ వ్యక్తమవుతోందని వివరించారు. పైగా వైసిపి నాయకులపై కేసులు పెట్టి అర్ధరాత్రి ఇళ్లల్లోకి వెళ్లి మరీ అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు : రవిచంద్ర

విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలు ఆడుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైసిపి విద్యార్థి విభాగం వర్కింగు ప్రెసిడెంట్ ఎం రవిచంద్ర విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలని కోరారు. విద్యార్థులకు రూ.6,400 కోట్ల బకాయి ఉందని, బడ్జెట్లో రూ.2,400 కోట్లు కేటాయించారని తెలిపారు. అందులోనూ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు.

రాజకీయ కక్షతోనే కేసు

- హైకోర్టుకు తెలిపిన ఎంపి మిథున్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి

రాజకీయ కక్షతోనే రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డిపై తప్పుడు మద్యం కేసు నమోదు చేసి వేధిస్తున్నారని సీనియర్ అడ్వకేట్ టి నిరంజన్‌రెడ్డి హైకోర్టులో వాదించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పార్లమెంట్ మెంబర్‌కు సంబంధం ఉండదన్నారు. సంబంధం లేని వ్యవహారంలో మిథున్‌రెడ్డిని నిందితునిగా చేర్చారని చెప్పారు. మద్యం విధానంతో ఎంపికి ఎలాంటి సంబంధం ఉంటుందో సిఐడి స్పష్టం చేయలేదన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు చూపలేదన్నారు.

సిఐడి దాఖలు చేసిన మద్యం కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఎంపి మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారించారు. నిరంజన్ రెడ్డి తన వాదనలను కొనసాగిస్తూ.. గతంలో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినప్పుడు అసలు మిథున్‌రెడ్డి నిందితుడే కాదని దర్యాప్తు అధికారి కోర్టుకు చెప్పారన్నారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన తర్వాతే పిటిషనరును సిఐడి నిందితుడిగా చేసిందని అన్నారు.

సిఐడి తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ.. మద్యం విధానం రూపకల్పన, దాని అమలు వెనుక పిటిషనర్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ముడుపులు చెల్లించిన కంపెనీలకే మద్యం ఆర్డర్లు ఇచ్చారని, దాని వెనుక కీలక పాత్రధారి పిటిషనర్ అని చెప్పారు. అక్రమంగా ఆర్జించిన మొత్తాలను వివిధ మార్గాల్లో, పలు నకిలీ కంపెనీల ద్వారా మళ్లించారన్నారు. తద్వారా ఖజానాకు రూ.8,500 కోట్ల మేర నష్టం వచ్చేలా చేశారని తెలిపారు. విచారణ బుధవారానికి వాయిదా పడింది.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

డయేరియాతో ఒకరు మృతి

- మరో 27 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - రౌతులపూడి(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతమైన రాఘవపట్నం పంచాయతీ పరిధిలోని దబ్బాది గ్రామానికి చెందిన మహిళ డయేరియాతో మృతి చెందారు. మరో 27 మంది అస్వస్థతకు గురయ్యారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... దబ్బాది గ్రామానికి చెందిన 28 మంది పాడేరులోని మోదుకొండ అమ్మవారి దర్శనానికి శనివారం బయలుదేరారు. అదే రోజు ఇంటి నుంచి ఆహారం తీసుకువెళ్లారు. నాతవరంలో కొంచెం ఆహారం తిన్నతారు. మిగిలిన ఆహారాన్ని దర్శనం అనంతరం శనివారం రాత్రి తీసుకున్నారు. దీంతో వారంతా వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వీరంతా పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఆదివారం వైద్యం పొందారు. పూర్తిగా కోలుకోకుండానే అదేరోజు సాయంత్రం స్వగ్రామమైన దబ్బాదికి చేరుకున్నారు. సోమవారం నాటికి కూడా కోలుకోకపోవడంతో వారంతా రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమించడంతో వంతల చెల్లయ్యమ్మ (60) మృతి చెందారు. విషయం తెలుసుకున్న డిఎంహెచ్ఒ నరసింహనాయక్ రౌతులపూడి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. డయేరియాకు గల కారణాలపై విచారణ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 27 మంది పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

సిఎం హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు

- సమగ్ర నివేదిక కోరిన డిజిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు తరచూ పర్యటించే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్డాను డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఆదేశించారు. దేశ వ్యాప్తంగా పలుచోట్ల హెలికాప్టర్, విమాన ప్రమాదాలు చోటుచేసుకున్న తరుణంలో సోమవారం సిఎం ఉపయోగించే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాజాగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమరావతి నుంచి తిరుపతికి ఇదే హెలికాప్టర్‌లో ప్రయాణించారు. అక్కడ నుంచి కృష్ణపట్నం పోర్టుకు ఇదే హెలికాప్టర్‌లో వెళ్లాలని షెడ్యూల్ ప్రకటించారు. ఆయన ఎక్కిన తర్వాత హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన కృష్ణపట్నం పోర్టు పర్యటనను రద్దు చేసుకుని విమానంలో నేరుగా తిరుపతి నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

జైలు నుంచి కొమ్మినేని విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సుప్రీంకోర్టు ఉత్తర్వులతో జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు సోమవారం రాత్రి గుంటూరు జైలు నుంచి విడుదల అయ్యారు. సాక్షి ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టిడిపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈనెల 10న హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు. కొమ్మినేని విడుదలకు సంబంధించి ఈనెల 13న సుప్రీంకోర్టు బెయిల్ ఉత్తర్వులు ఇచ్చింది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు జైలు అధికారులు ఆయన్ను విడుదల చేశారు. జైలు నుంచి కొమ్మినేని బయటకు రాగానే మాజీ మంత్రి అంబటి రాంబాబు, పలువురు వైసిపి నాయకులు, న్యాయవాదులు కలిశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ... కొమ్మినేని విడుదలలో కూడా అధికారులు తీవ్ర జాప్యం చేశారన్నారు. రాత్రి ఏడు గంటల వరకు కాలయాపన చేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం కన్నా వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికే సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే కొమ్మినేనిపై అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు.

మా ఊరిలోనే బడి

పాఠశాలల తరలింపునకు నిరసనగా పలుచోట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన

కెవిబిపురం మండలంలో స్కూలుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి- మంగళం,బుచ్చినాయుడు కండ్రిగ, కెవిబిపురం

'మా పిల్లలను బాగా చదివించుకోవాలని ఆశగా ఉండేది.. విలీన ప్రక్రియతో మా ఆశలు అడియాశలవుతున్నాయి. మోడల్ స్కూళ్ల ప్రాతిపాదన తీసుకొచ్చి పక్క స్కూళ్లల్లో విలీనం చేస్తుండడంతో మా పిల్లలు ఐదారు కిలోమీటర్లు నడచి వెళ్లాల్సి వస్తోంది. పిల్లలు స్కూలుకు వెళ్లి వచ్చే వరకూ భయంగానే ఉండాల్సి ఉంటుంది.. ' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కు విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు విచ్చేసి నిరసన గళం వినిపించారు. తిరుపతి సమీపంలోని సి మల్లవరం గ్రామ పాఠశాలకు 3, 4, 5 తరగతులను విలీనం చేశారని పెరుమాళ్ళపల్లి, చందమామ పల్లి, కొప్పరవాండ్లపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మా ఊరిలోనే పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- 'మా బడి మా ఊళ్లోనే ఉండాలని.. వేరే బడి మాకొద్దు' అని బుచ్చినాయుడు కండ్రిగ మండలం పార్లపల్లి ఎ గ్రామస్తులు బడికి తాళం వేసి నినాదాలు చేశారు. 3, 4, 5 తరగతుల పిల్లలను పివి కండ్రిగ పాఠశాలకు పంపించాలంటే మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలని, భద్రత లేని ఆ బడికి తమ పిల్లలను పంపించేది లేదని తల్లిదండ్రులు స్పష్టం చేశారు. విలీనం చేయరాదని గతంలో అనేకమార్లు ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లినా తమ పిల్లల గోడు పట్టించుకోలేదని వాపోయారు.
- ఆలత్తూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. 'పాఠశాల మా హక్కు.. విద్య మా భవిష్యత్' అంటూ స్కూలు ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. తమ ఊళ్లో పాఠశాల మూసివేస్తే ఇక్కడి చిన్నారులు ఏడు కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి ఉంటుందని, తమ విన్నపాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఆలత్తూరు పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని పేరెంట్స్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు, గ్రామస్తులు డిమాండ్‌చేశారు.
- కెవిబిపురం మండలంలో మొత్తం 75 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 4,962 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండల కేంద్రానికి మారుమూల ప్రాంతమైన గురుకుల కండ్రిగ గ్రామంలోనూ, వగత్తూరు గ్రామంలోనూ చదువుతున్న విద్యార్థులను దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలోని రాయపేడు పాఠశాలలో విలీనం చేశారు. దీంతో పాఠశాలకు తాళం వేసి తల్లిదండ్రులు రోడ్డెక్కారు. గురుకులకండ్రిగ, వగత్తూరు, బంగారమ్మ కండ్రిగ గ్రామస్తులు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. టిడిపి కూటమి నిర్ణయం వల్ల ప్రతి విద్యార్థి దాదాపు నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ తెలిపారు. విద్యార్థుల నిరసన కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు నియోజకవర్గం నుంచి మూడు గ్రామాల దళితులు చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

ఉద్యోగుల వివరాలన్నీ ఒకేచోట!

- కొత్త పోర్టల్ ఏర్పాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల వివరాలు అన్నీ ఒకేచోట పొందుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్థికశాఖ ప్రకటించింది. ఉద్యోగుల విధుల్లో పారదర్శకత పెంపొందించేందుకు, బాధ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని ఆర్థికశాఖ తెలిపింది. ఈ మేరకు సోమవారం మార్గదర్శకాలను పేర్కొంటూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ పోర్టల్‌లో రాష్ట్రంలో ఉన్న మొత్తం ఉద్యోగులను మ్యాపింగ్ చేస్తున్నట్లు పేర్కొంది. ఉద్యోగుల సెలవులు, వారికి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, బదిలీలు వంటి వివరాలు ఈ పోర్టల్‌లో నమోదవుతాయి. అలాగే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి సమస్యలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసేందుకు కూడా ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ఉద్యోగులకు కల్పించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, వాటి నిర్వహణ కూడా ఈ పోర్టల్ పరిధిలోకే తీసుకురానున్నారు. తాజాగా జారీ చేసిన ఉత్తర్వులలో ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మ్యాపింగ్ చేసేందుకు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ సూచించింది.

అలాగే వారి విధులకు సంబంధించిన స్ట్రక్చర్‌ను కూడా మండల స్థాయి నుంచి నమోదుచేయాలని నిర్దేశించింది. ప్రఉద్యోగుల ఇ-ఆఫీస్ ఐడిలను కూడా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేసింది. ఈ35 సచివాలయ శాఖలు, 145 శాఖాధిపతుల కార్యాలయాలకు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరాలను ఆర్థికశాఖ పంపించింది.

భూమి పత్రాలను సబ్ కలెక్టర్‌కు అందజేస్తున్న దాత సువర్చల శశికిరణ్

ఉపాధి కల్పనకు ఎకరం భూమి వితరణ

- మరో రూ.పది లక్షలు విరాళం ప్రకటించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)

మహిళల స్వయం ఉపాధి కల్పన కోసం ప్రభుత్వానికి ఎకరా పొలాన్ని వితరణ చేశారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొలకలూరులో ప్రభుత్వం తరపున ఉపాధి కల్పనకు పరిశ్రమ ఏర్పాటు కావాలన్న సంకల్పంతో తన తండ్రి పొన్నెకంటి పోతురాజు పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు తరపున గ్రామస్తురాలు సువర్చల శశికిరణ్ తన ఎకరా భూమిని ప్రభుత్వానికి రిజిస్టర్ చేసి, ఆ పత్రాలను మంత్రి మనోహర్ చేతుల మీదుగా సబ్ కలెక్టర్ సంజనసింహకు అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. గ్రామంలో పేదల ఉపాధి నిమిత్తం ఎకరా భూమిని సువర్చల శశికిరణ్ వితరణ చేయడం గొప్ప విషయన్నారు. దాత ఆశయాలకు అనుగుణంగా త్వరితగతిన ఉపాధి అవకాశం కల్పించే దిశగా ప్రభుత్వం తరపున నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రూ.పది లక్షల విరాళాన్ని ప్రకటించారు. దాతను సత్కరించి కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, పొన్నెకంటి చక్రవర్తి, పి.సత్యకళ, డాక్టర్ పి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమ కార్మికులను ఆదుకోండి

- ఎమ్మెల్యే బేబినాయనకు కార్మిక నాయకుల వినతి

ప్రజాశక్తి - బొబ్బిలి

లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమ కార్మికులు, ఉద్యోగులను ఆదుకోవాలని కోరుతూ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు సోమవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు ఎస్ వెంగళరావు, ఎస్ సన్యాసిరాజు, డి నాగరామారావు మాట్లాడుతూ చక్కెర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఏడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిశ్రమ ఎన్‌సిఎల్‌టి ఆధీనంలో ఉందని, పరిశ్రమ కొనుగోలుకు టెండర్లు వేసి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన 150 మందికి పెన్షన్, గ్రాడ్యుటి ఇప్పటికి ఇవ్వలేదన్నారు. ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం ఎన్‌సిఎస్ భూములను అమ్మగా వచ్చిన సొమ్ములో పిఎఫ్ కోసం రూ.2.20 కోట్లు ఎసిసి, సీతానగరం తహశీల్దార్ ఖాతాలో ఉన్నప్పటికి చెల్లించడం లేదన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ స్పందించి పిఎఫ్‌కు నిధులు జమ చేసేలా చూడాలని కోరారు. కార్మికులు, ఉద్యోగులు వేతనాలు నుంచి పిఎఫ్ కోసం కట్ చేసిన సొమ్మును యాజమాన్యం జమ చేయలేదన్నారు. ఇప్పటి వరకు 25 మంది కార్మికులు మరణించారని, ఆయా కుటుంబాలకు ఎటువంటి బెనిఫిట్స్ రాలేదన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై బేబినాయన స్పందిస్తూ చక్కెర పరిశ్రమ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

బోటు నుంచి జారి పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి : బోటు నుంచి జారిపడి కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు మత్స్యకారులు సముద్రంలో పడి మరణించారు. ఈ సంఘటన డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో సోమవారం చోటుచేసుకుంది. సఖినేటిపల్లి ఎస్ఐ దుర్గశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన ఆరుగురు మత్స్యకారులు నాగిడి వెంకటేశ్వరరావుకు చెందిన మెకనైజ్డ్ బోటులో ఆదివారం సముద్రంలో వేటకు వెళ్లారు. అంతర్వేది తీరానికి తిరిగి వస్తుండగా గోదావరి సంగమం వద్ద అలల ఉధృతికి బోటులో ఉన్న నాగిడి రాము (28), తుమ్ము పోతురాజు (50) సముద్రంలో పడి గల్లంతయ్యారు. మిగిలిన నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. స్థానిక మత్స్యకారులు గాలించినా ఫలితం దక్కలేదు. సాయంత్రానికి మత్స్యకారుల మృతదేహాలు గోదావరి తీరానికి కొట్టుకొచ్చాయి. ఘటనా ప్రాంతాన్ని సఖినేటిపల్లి ఎస్ఐ దుర్గ శ్రీనివాస్ పరిశీలించారు.

కచ్చితమైన సమాచారం ఇవ్వండి

- సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ఎమ్‌డి వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని సబ్మిట్ చేయాలని అధికారులను గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఎమ్‌డి శివప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన సంబంధిత అధికారులతో ఆటోనగర్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాస్తవంగా సిబ్బంది ఎక్కడ పనిచేస్తున్నారో అందుకు అనుగుణంగా ప్రతి సచివాలయం వారీ సబ్మిట్ చేయాలని, అందులో వారు పనిచేస్తున్నారా? లేక పోస్టు ఖాళీగా ఉందా అనే సమాచారం కచ్చితంగా పేర్కొనాలని సూచించారు. డిప్యూటేషన్‌లోని సిబ్బంది విషయంలో వారు ఎక్కడ నుంచి జీతం తీసుకుంటున్నారో, అదే సచివాలయంలో వారిని వర్కింగ్‌గా చూపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వేకెంట్‌గా చూపకూడదన్నారు. ట్రాన్స్‌ఫర్ చేయదలచినప్పుడు ఎస్ పొజీషన్ నుంచి ఎస్ పొజీషన్‌కు మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టు కూడా ఎస్ గానే ఉండాలి, టార్గెట్ పోస్టు కూడా ఎస్ మాత్రమే అయి ఉండాలని ఎమ్‌డి పేర్కొన్నారు. అర్బన్, రూరల్ విషయంలో ప్రత్యేక నిబంధనలు ఉన్నాయన్నారు. సిబ్బంది సొంత మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఉంటే వారు పక్కనున్న రూరల్ ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ కావాలంటే అర్బన్, రూరల్ ఏరియాలు వేర్వేరు రెవెన్యూ మండలాలకు చెందినవి కావాలన్నారు. ఒకే రెవెన్యూ మండలానికి చెందిన రూరల్, అర్బన్‌కు ట్రాన్స్‌ఫర్‌కు అనుమతించబడదని తెలిపారు.

'భిక్షాటన, బెగ్గరి' పదాల తొలగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దాసరి కులస్తులకు మంజూరు చేసే ధ్రువీకరణ పత్రాల్లో ఇకపై 'భిక్షాటన, బెగ్గరి' పదాలను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాసరి రిజర్వేషన్ పోరాట సమితి సమర్పించిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకుని 'భిక్షాటన, బెగ్గరి' అనే పదాలు అసాంఘికంగా, అవమానకరంగా ఉన్నందున ఈ పదాలను తొలగించి కేవలం 'దాసరి' అని మాత్రమే పేర్కొంటూ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఉత్తర్వుల్లో వెల్లడించారు. అదే విధంగా ఇందుకు సంబంధించి 1995లో జారీ చేసిన జిఒ 32లో సవరణ చేశారు.

నీటి గుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - కురుపాం (పార్వతీపురం మన్యంజిల్లా): చేపల కోసం నీటి గుంతలో దిగిన ఇద్దరు గిరిజన విద్యార్థినులు మృత్యువాత పడిన ఘటన సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం బొడ్డుమానుగూడలో చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. లంకాజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బిడ్డిక సునంద (12), ఆరో తరగతి చదువుతున్న మండంగి జెస్సిక (11) గ్రామ సమీపంలో ఇటుకలు తయారీ కోసం చేసిన గొయ్యిలో చేపల కోసం సోమవారం మధ్యాహ్నం దిగారు. లోతు ఎక్కువ ఉండడంతో కూరుకుపోయారు. బయటకు రాలేక ఊపిరాడక ఇద్దరు మరణించారు. మధ్యాహ్నం భోజనానికి పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీపంలో వెతికారు. ఆ గుంతలో జెస్సిక మృతదేహం కనిపించడంతో మరో బాలిక సునంద కోసం వెతికారు. ఆ బాలిక మృతదేహం కూడా గుంతలో లభ్యమైంది. వేసవి సెలవులకు వచ్చి ఇంకా పాఠశాలకు వెళ్లలేదని, మరో రెండు రోజుల్లో పాఠశాలకు తీసుకెళ్దామని అనుకున్నామని, ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు ధరలపై కేంద్ర మంత్రి వ్యాఖ్యలు అసమంజసం

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పొగాకు ధరల పతనంపై అసమంజసమైన వ్యాఖ్యలు మాని, రైతుల వద్ద ఉన్న పంటను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రైతులకు గిట్టుబాటు ధరలు, పొగాకు కొనుగోళ్ల సమస్యలపై గోయల్ చేసిన వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు అష్టకష్టాలు పడి అప్పులు చేసి పొగాకు పండిస్తే, ఆ పొగాకును కొనుగోలు చేయాల్సిన కంపెనీలు ముందుకు రావడం లేదని విమర్శించారు. ప్రజలు ఓట్లతో గెలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులకు న్యాయమైన ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోకాపోగా, కంపెనీలకు వత్తాసుపలకడం సరికాదన్నారు. మరోవైపు పొగాకు ఉత్పత్తి తగ్గించాలని మంత్రి గోయల్ రైతులకు ఉచిత సలహా ఇచ్చారన్నారు. ఈ మాత్రం ఉచిత సలహా కోసం ఢిల్లీ నుండి ఇక్కడికి రావాల్సిన అవసరం లేదన్నారు. రైతుల దగ్గర ఉన్న పొగాకును చివరికాడ వరకూ కొనుగోలు చేస్తామని ఈ నెల 5న ముఖ్యమంత్రి మాటగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని తెలిపారు. అయినా రాష్ట్రంలో ఎక్కడా పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదన్నారు. గతంలో మిర్చి రైతులకు ఇచ్చిన హామిని ఉల్లంఘించారన్నారు. అలా జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతుల వద్ద ఉన్న పొగాకు వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. పొగాకు ఉత్పత్తుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిఎస్‌టి ఇతర పన్నులు రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. పొగాకు రైతులను ఆదుకునే విషయంలో మీనమేషాలు లెక్కించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల పండించిన పొగాకు క్వింటాకు రూ.15 వేలు తక్కువ కాకుండా గిట్టుబాటు ధర ఇచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ నెల దర్శన కోటా రేపు విడుదల

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను జూన్ 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేయనుంది. ఈ టికెట్లు పొందిన వారు జూన్ 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాలని, వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని టిటిడి పేర్కొంది. 21న ఆర్జిత సేవా టికెట్లు, అదే రోజు మధ్యాహ్నం వర్చువల్ సేవల కోటా, 23న అంగప్రదక్షిణం టోకెన్లు, శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా, వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా, 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా, గదుల కోటా, 25న శ్రీవారి సేవ ఆగస్టు నెల కోటా విడుదల చేయనున్నారు. మరిన్ని వివరాలకు టిటిడి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొంది.

ఎగుమతుల్లో డీలా

- 21.88 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు మేలో 2.17 శాతం పతనం

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్‌లో భారత ఎగుమతులు డీలా పడ్డాయి. ఈ ఏడాది మేలో సరుకుల ఎగుమతులు 2.17 శాతం పతనమై 38.73 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో 39.59 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన మేలో దేశ దిగుమతులు 1.7 శాతం తగ్గి 60.61 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఎగుమతులు తక్కువగా ఉండి.. దిగుమతులు ఎక్కువగా ఉండటంతో వాణిజ్యలోటు 21.88 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఏప్రిల్ - మే కాలంలో ఎగుమతులు 3.11 శాతం పెరిగి 77.19 బిలియన్లుగా, దిగుమతులు 8 శాతం ఎగిసి 125.52 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ సోమవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. దీంతో రెండు నెలల్లో 48.33 బిలియన్ల వాణిజ్య లోటు నమోదయ్యింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక అనిశ్చితి ఎగుమతులపై ప్రభావం చూపిందని వాణిజ్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత ఇరాన్- ఇజ్రాయిల్ ఉద్రిక్తతలు భారత ఎగుమతులపై మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

గడిచిన మే నెలలో బియ్యం, ముడి ఇనుప ఖనిజం, రత్నాలు, ఆభరణాలు, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రతికూల వృద్ధి చోటు చేసుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు ఏకంగా 30.32 శాతం క్షీణించి 5.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మరోవైపు ముడి చమురు, పసిడి దిగుమతులు వరుసగా 26.14 శాతం, 12.6 శాతం పతనమై 14.75 బిలియన్లు, 2.5 బిలియన్లుగా ఉన్నాయి. భౌగోళిక అనిశ్చితులు ఉన్నప్పటికీ ఎగుమతుల్లో భారత్ రాణించిందని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ పేర్కొన్నారు. గడిచిన రెండు నెలల్లో ముడి చమురు ధరల్లో తగ్గుదల ఈ రంగంలోని భారత ఎగుమతులను ప్రభావిం చేసిందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో స్థూల భారత ఎగుమతులు స్వల్పంగా 0.08 శాతం పెరిగి 437.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మరోవైపు దిగుమతులు 6.62 శాతం పెరిగి రూ.720.24 బిలియన్ డాలర్లకు ఎగిశాయి.

మెటా ఇండియా హెడ్‌గా అరుణ్ శ్రీనివాస్

న్యూఢిల్లీ : ప్రముఖ టెక్ సంస్థ మెటా తన భారత వ్యాపార విభాగం మేనేజింగ్ డైరెక్టర్, హెడ్‌గా అరుణ్ శ్రీనివాస్‌ను నియమించింది. జులై 1న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సంస్థ తెలిపింది. 2020లో మెటాలో చేరిన ఆయన ప్రస్తుతం కంపెనీ భారత వ్యాపార ప్రకటనలకు డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. మెటా వ్యాపార దీర్ఘకాలిక వృద్ధికి, కంపెనీని మరింత సమర్థంగా ముందుకు నడిపించేందుకు అరుణ్ శ్రీనివాస్ నియామకం ఉపకరిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. గతంలో హిందుస్థాన్ యూనిలీవర్, రీబాక్, ఓలా, పెట్టుబడి సంస్థ వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ వంటి కంపెనీలలో సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లో మూడు దశాబ్దాల పాటు పని చేసిన అనుభవం ఉంది.

ఐఐటి మద్రాస్‌తో సామసంగ్ ఆర్‌అండ్‌డి ఒప్పందం

గూర్‌గావ్ : కృత్రిమ మేధా (ఎఐ)లో పరిశోధనలకు గాను ఐఐటి మద్రాస్‌తో సామ్‌సంగ్ ఆర్‌అండ్‌డి ఇన్‌స్ట్యూట్ (ఎస్‌ఆర్‌ఐ) నోయిడా కీలక ఒప్పందం కుదర్చుకుంది. ఇందులో భాగంగా ఇరు సంస్థలు భారత భాషలు, హెల్త్‌టెక్, జనరేటివ్ ఎఐలో టెక్నలాజీ డెవలప్‌మెంట్, పరిశోధనలపై దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఈ ఒప్పందంలో ఐఐటి మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి కామకోటి, సామ్‌సంగ్ ఎస్‌ఆర్‌ఐ ఎండి క్యుంగ్‌యున్ రూ పాల్గొన్నారు.

సొంత మండలంలో బదిలీలు కల్పించాలి

- సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలం, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ల పరిధిలో బదిలీలు కల్పించాలని ప్రభుత్వానికి సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌డి జానీ పాషా, బత్తుల అంకమరావు.. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

జియో సేవలపై వేలాది ఫిర్యాదులు

- సిగ్నల్ అంతరాయంపై ఆందోళన

న్యూఢిల్లీ : ప్రముఖ ప్రయివేటు టెలికం కంపెనీ రిలయన్స్ జియో నెట్‌వర్క్‌లో సోమవారం అంతరాయాలు తలెత్తాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, మొబైల్ సిగ్నల్, జియో ఫైబర్ సేవలకు సంబంధించిన సమస్యలు చోటు చేసుకున్నాయి. దీనిపై వేలాది మంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మధ్యాహ్న సమయంలో జియో సేవలు పొందడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు వినియోగదారులు సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేశారు. 12,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయని అంతరాయాల ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ తెలిపింది. 32 శాతం మంది యూజర్లు కాల్ సంబంధిత సమస్యలను ఎదుర్కోగా, 12 శాతం మంది వినియోగదారులు జియో ఫైబర్ సేవల్లో అంతరాయం కలిగినట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై రిలయన్స్ జియో అధికారికంగా స్పందించలేదు.

ఎస్‌ఎఫ్‌బితో మారుతి భాగస్వామ్యం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన వాహన ఫైనాన్సింగ్ నెట్‌వర్క్‌ను పెంచుకోవడానికి వీలుగా ఇఎస్‌ఎఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో ఒప్పందం కుదర్చుకున్నట్లు తెలిపింది. దీంతో ఆ బ్యాంక్‌కు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని శాఖల ద్వారా వినియోగదారులకు సులభంగా రిటైల్ ఫైనాన్సింగ్ సొల్యూషన్స్ లభించనున్నాయని పేర్కొంది.

నర్మద బయో-కెమ్ లిమిటెడ్

ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర రాష్ట్రాలలో దిగుమతి చేసుకుని విక్రయించడానికి క్రింది విధమైన 100 శాతం నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు

NPK(19-19-19)

పైన పేర్కొన్న ఉత్పత్తుల నాణ్యత (ఎఫ్‌సిఓ) 1985 నోటిఫికేషన్ నం.ఎస్.0.4120 (ఇ), తేది : 30.12.2017 ప్రకారం

....దిగుమతి చేసుకొని మరియు మార్కెట్ చేసేది....

నర్మద బయో కెమ్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : "నర్మద హౌస్", ప్లాట్ నం.252, టి.పి.నం.50, సింధూ భవన్ రోడ్డు, తాల్‌తేజ్-బొడక్‌దేవ్, అహ్మదాబాద్-380059.

ఫోన్ : 079-26871072, 26870005.

ఇ మెయిల్ : narmada@nbclindia.com

సంపాదకీయం

పొగాకు రైతుకు మొండిచెయ్యి

పండించిన పొగాకు పంటకు దారుణంగా ధర పతనమై దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులను కేంద్ర ప్రభుత్వం దగా చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోంది. రెండు మాసాలుగా రేటు పడక ఖర్చులు సైతం రాక తమను ఆదుకోవాలని రైతులు ఆందోళనపడి రోడ్డెక్కగా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ అని, ధరల స్థిరీకరణ నిధి అని మభ్యపెడుతోంది తప్ప ఆచరణ లేదు. సరిగ్గా ఇప్పుడే ఢిల్లీ నుంచి రాష్ట్రానికొచ్చిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ రైతులను ఆదుకునే బదులు కంపెనీల వద్ద నిల్వలు పేరుకుపోవడం వలన ధర పతనమైందని చేతులెత్తేసి రైతుల పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వ కర్కశాన్ని వెల్లడించారు. పైగా పొగాకు సాగును తగ్గించాలని ఉచిత సలహా పడేయడం నష్టాల్లో ఉన్న రైతులను అపహాస్యం చేయడమే. పియూష్ వ్యాఖ్యలను ఖండించి నిరసన తెలిపి రైతాంగ ప్రయోజనాలు పరిరక్షించాల్సిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మొండిచెయ్యి చూపించినా కేంద్రం సహకరిస్తుందని పేర్కొని లేని సంతోషాన్ని ఒలకబోయడం అభ్యంతరకరం. తాము మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఖర్చు చేసే రూ.300 కోట్లలో సగ భాగం నిధులు పొగాకు బోర్డు భరించేలా చర్యలు తీసుకోవాలన్న అభ్యర్థనను పియూష్ పట్టించుకోకపోయినా కూటమి ప్రభుత్వంలో ఇసుమంతైనా చలనం లేదు. ఇదేనా 'డబుల్ ఇంజన్' సర్కార్ పనితనం?

ఈ ఏడాది రాష్ట్రంలో 3.45 లక్షల ఎకరాల్లో పొగాకు సాగు కాగా అందులో సగానికిపైన హెచ్‌డి (నల్ల బర్లీ) రకమే. ప్రకాశం, ఏలూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 450 గ్రామాల్లో సాగైంది. ఇది ప్రభుత్వ లెక్కనే. ఈ తడవ పొగాకు సాగు కొంత పెరిగిన మాట నిజం. అందుకు కారణం కంపెనీలే. ఊరూరా తిరిగి ధర వస్తుందని రైతులను నమ్మబలికాయి. తీరా పంట మార్కెట్‌లోకొచ్చే సమయానికి అమాంతం ధర దిగ్గోశారు. కంపెనీలు రైతులకు బాండ్లు ఇచ్చిన మేరకు కొనాలన్నా కూడా రెండు మూడు నెలలు ఆగాలంటున్నాయి. రైతుల వద్ద కనీసం 7 కోట్ల కిలోల (70 మిలియన్ కిలోలు) పొగాకు నిల్వలున్నాయి. ఒక ఎకరా పొగాకు సాగుకు రైతుకు తక్కువలో తక్కువ రూ.1.20 లక్షలు అవుతోంది. కౌలు రైతులకు మరో 20 వేలు అదనం. పొగాకులో కౌలు సేద్యం బాగా పెరిగింది. క్వింటాకు 12,500 వస్తేనే రైతుకు కాస్తంత ఉపశమనం. లేదంటే నష్టాలే. నాణ్యత పేరిట కంపెనీలు రైతుల వద్ద ధర తగ్గిస్తున్నాయి. ఈ దుర్మార్గమే పొగాకు రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి 2 కోట్ల కిలోలు (20 మిలియన్) కొనుగోలు చేస్తామని రెండు మూడు వారాలుగా మాటలు చెప్పడమే తప్ప కార్యరంగంలోకి దిగింది లేదు. మార్క్‌ఫెడ్ వద్ద నిధుల్లేవు. ధరల స్థిరీకరణ నిధి నుంచి ప్రభుత్వం ఇచ్చింది లేదు. కొనుగోలు చేసిన పొగాకును నిల్వ చేసేందుకు గోదాములు లేవు. ఈ సమస్యల నడుమ రైతుల నుంచి పొగాకు కొనుగోలు అనుమానమే. మిర్చికి మల్లేనే పొగాకు పరిస్థితీ!

వాణిజ్య పంట అయిన పొగాకు వలన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడాదికి రూ.లక్ష కోట్లకుపైన పన్ను ఆదాయం లభిస్తోంది. కేంద్రం అధీనంలో గల పొగాకు బోర్డు నియంత్రణ పరిమితం. పూర్తి ఆధిపత్యం కార్పొరేట్ కంపెనీలదే. జిపిఐ, ఐటిసి, ఎంఎల్ వంటి కార్పొరేట్ దిగ్గజాలే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను శాసిస్తాయన్నది బహిరంగ రహస్యం. సాగు చేయమని రైతులను వాళ్లే ప్రేరేపించి కొనుగోలు చేయకుండా భీష్మించినా ప్రభుత్వాలు ఏమీ చేయలేకపోతున్నాయి. దాసోహం అంటున్నాయి. ఎపి ప్రభుత్వం ఎంతగా ఘీంకరించినా, మంత్రుల కమిటీ వేసి చర్చలు జరిపినా కంపెనీలు ససేమిరా అంటున్నాయి. క్వాలిటీ అని, అంతర్జాతీయంగా ఎగుమతులకు డిమాండ్ తగ్గిందని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నా ప్రభుత్వం కిమ్మనట్లేదు. ఎపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనిపించాలి. అప్పటి వరకు ఆగకుండా రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవాలి. అవసరమైన నిధులను కేంద్రం నుంచి రాబట్టాలి. కంపెనీలతో పొగాకును తక్షణం కొనిపించాలి. నల్ల బర్లీ సాగును పొగాకు బోర్డు నియంత్రణ కిందికి తీసుకొచ్చేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, కంపెనీల మెడలు వంచేందుకు రైతులు ఐక్యంగా ఉద్యమించాలి.

మంచి మాట

దేశమంటే సామాన్యులు. సామాన్యుల విద్యా వికాసం పైన, సాంస్కృతిక పునరుజ్జీవనం పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది. ప్రజా చైతన్యం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుంది.
- ఎన్.ఎఫ్.ఎస్. గ్రుండ్‌విగ్, ఫోక్ స్కూల్ రూపకర్త, డెన్మార్క్

వేతనాల అసమానతలు-ముక్కలౌతున్న కార్మికవర్గం

ఐఎల్‌వో తాజా నివేదిక వెల్లడి

విశ్లేషణ

సంజయ్ రాయ్

కార్మికశక్తి మీద, ఉత్పత్తి క్రమం మీద పెట్టుబడి రాజకీయంగా పైచేయి సాధించడం వల్లనే ఇది సాధ్యపడుతోంది. ఈ పెట్టుబడి ఆధిక్యతను ప్రతిఘటించి, పెరుగుతున్న అసమానతల నుండి బైట పడాలంటే ముక్కలుముక్కలుగా ఉన్న కార్మికవర్గంలో సమిష్టి వర్గ చైతన్యాన్ని పెంపొందించే రాజకీయ ప్రక్రియను వేగవంతం చేయడమే పరిష్కారం.

కరోనా మహమ్మారి ప్రభావంతో కార్మికుల వేతనాలు దిగజారడం గాని, ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోవడం గాని జరిగింది. ఆ పరిస్థితిలో తాజాగా కొంత మార్పు వచ్చిందని, ప్రపంచ మార్కెట్‌లో కార్మికుల నిజవేతనాలలో కొంత పెరుగుదల చోటు చేసుకుందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదిక వెల్లడించింది. ఐతే, గత రెండేళ్ళ కాలంలో కార్మికుల వేతనాలలో కొంత పెరుగుదల కనిపించినా, వారి వేతనాల్లో అసమానతలు మాత్రం పెరుగుతూనే వున్నాయి.

పెట్టుబడి ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచంలో ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి సంచరించగలిగిన శక్తితో పెట్టుబడి ఉంది. కాని అదే విధమైన స్వేచ్ఛ కార్మికవర్గానికి లేదు. అందువలన ఎక్కడ చౌకగా కార్మికుల శక్తి దొరుకుతుందో అక్కడికి పోయి ఆ చౌక కార్మిక శక్తిని కొల్లగొట్టేందుకు పెట్టుబడి పూనుకుంటోంది. సరుకుల ఉత్పత్తిని ఒక దగ్గర కేంద్రీకరించకుండా దానిని ముక్కలు చేసి ఏ ఉత్పత్తి క్రమంలోనైతే కార్మికుల పాత్ర ఎక్కువగా అవసరమో ఆ భాగాన్ని మాత్రం చౌకగా కార్మికులు లభించే ప్రాంతానికి తరలించడం ప్రపంచీకరణలో అంతర్భాగం.

స్వేచ్ఛా మార్కెట్ నేడు ఉనికిలో ఉందని అనుకోవడం కన్నా పెద్ద భ్రమ మరొకటి లేదు. గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువ స్థాయిలో నేడు ప్రపంచస్థాయి బహుళజాతి కార్పొరేట్లు తమ ఉత్పత్తి నెట్‌వర్క్‌లను అత్యంత కేంద్రీకృత పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాయి. తాము ఉత్పత్తి చేసే సరుకులకు అవసరమైన ముడి సరుకులను, విడి భాగాలను సరఫరా చేసే ఆ యా సప్లయర్ల మధ్య పోటీ నెలకొనేలా చేస్తున్నాయి. ఎవరైతే అతి తక్కువ ధరలకు సప్లై చేయగలుగుతారో వారే ఆ సరఫరా కాంట్రాక్టులను చేజిక్కించుకోగలుగుతారు. దాని ఫలితంగా వారు తమ వద్ద పని చేసే కార్మికుల శ్రమను అతి తక్కువ స్థాయిలో తొక్కిపట్టి ఉంచడానికి పూనుకుంటున్నారు. అలా చేసినప్పుడు కార్మికుల నుండి ప్రతిఘటన రాకుండా ఉండడానికి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. లేబర్ మార్కెట్‌లో అతి తక్కువ వేతనాలు లభించే చోట్ల మహిళా కార్మికుల శాతం పెరుగుతోంది. వేతనం చెల్లించే పద్ధతి కూడా అమలు కాకుండా గుండుగుత్తగా (ఇంత పనిచేయడానికి ఇంత సొమ్ము చెల్లిస్తాం, ఎంతమంది పని చేశారు, ఎంత కాలం పని చేశారు అన్నదానితో మాకు నిమిత్తం లేదు అని యజమానులు చేసుకునే ఒప్పందాలు) పనులకు నియమించడం పెరుగుతోంది.

ఈ పద్ధతుల వలన ఒక వైపు కార్మికుల వేతనాలలో అసమానతలు పెరుగుతున్నాయి. మరొక వైపు ఆ కార్మికులు పలు విధాలుగా ముక్కలౌతున్నారు. కాని పెట్టుబడి కేంద్రీకరణ మాత్రం పెరుగుతోంది. సంపద పోగుబడడమూ పెరుగుతోంది. ముక్కచెక్కలౌతున్న కార్మికవర్గంలో ఒక ముక్కను మరొక ముక్కకు వ్యతిరేకంగా పోటీ పెట్టి, అధికార, అనధికార నియంత్రణా పద్ధతులను ఉపయోగించి పెట్టుబడిదారులు మాత్రం తమ లాభాలను పెంచుకోగలుగుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా వేతనాల తీరు తెన్నులు ఏ విధంగా ఉన్నాయన్నది తాజాగా ఐఎల్‌వో విడుదల చేసిన ప్రపంచ వేతన నివేదిక (గ్లోబల్ వేజ్ రిపోర్ట్) వెల్లడించింది. ద్రవ్యోల్బణం కారణంగా 2023 వరకూ నిజ వేతనాలు బాగా పడిపోయాయి. కాని 2023 తర్వాత ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో కొంతవరకూ కోలుకున్నాయి. ఐతే ఈ పరిస్థితి ప్రపంచం అంతా ఒకే విధంగా లేదు. ఐఎల్‌వో అధ్యయనం చేసిన 160 దేశాలకు గాను 96 దేశాల్లో ద్రవ్యోల్బణం వలన నిజవేతనాలకు కలిగిన నష్టాన్ని పూర్తిమేరకు భర్తీ చేయలేదు. దాని వలన పెరిగిన సంపదలో కార్మికుల వాటా తగ్గుతూనే వుంది. జిడిపి పెరుగుదలను బట్టి చూసినా అందులో కార్మికులకు దక్కిన వాటా తగ్గుతూనే వుంది. సంపన్న దేశాలవరకే చూసినా, గత 25 సంవత్సరాలలో అక్కడ కార్మికుల ఉత్పాదకత 29 శాతం పెరిగితే, వారి నిజవేతనాలు మాత్రం 15శాతమే పెరిగాయి. రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన అనంతర కాలంలో యజమానుల లాభాల వాటా, కార్మికుల వేతనాల వాటా మారకుండా కొన్ని దశాబ్దాలపాటు స్థిరంగా కొనసాగాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కార్మికుల వాటా పడిపోతూనేవుంది.

గత రెండేళ్ల కాలంలో మొత్తం మీద చూసినప్పుడు కార్మికుల నిజవేతనాలలో పెరుగుదల కనిపించినా, ఆ వేతనాల అసమానతలు మాత్రం పెరుగుతున్నాయి. వేతనాల స్థాయిని బట్టి ప్రపంచ దేశాలను కనిష్ట, మధ్య తరహా, గరిష్ట స్థాయి దేశాలుగా వర్గీకరించి పరిశీలించితే, గరిష్ట స్థాయి వేతనాలు ఉన్న దేశాలలో వేతనాల్లో అసమానతలు తక్కువగా ఉన్నాయి. కనిష్ట, మధ్య తరహా దేశాల్లో అసమానతలు ఎక్కువగా ఉన్నాయి. దీనికి కారణం అసంఘటిత రంగం ఆ దేశాల్లో ఎక్కువగా పెరగడమే. కనిష్ట స్థాయి వేతనాలు ఉన్న దేశాలలో అసంఘటిత కార్మికులు 90 శాతం వరకూ ఉన్నారు. మధ్య తరహా దేశాల్లో 49 నుండి 75 శాతం దాకా ఉన్నారు.

వేతనాలను నిర్ణయించడం అనేది ప్రస్తుత నయా ఉదారవాద యుగంలో రాను రాను ఒక రాజకీయ ప్రక్రియగా మారిపోతోంది. అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను కాపాడే రాజకీయ ప్రతినిధులు ఎవరూ లేకపోవడంతో వారు నోరు లేని జీవులుగా మిగిలిపోతున్నారు. దాంతో తీవ్ర స్థాయి దోపిడీకి గురౌతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి కాని, చట్టపరంగా గాని వారికి ఎటువంటి రక్షణా లభించడం లేదు. ఇటువంటి పరిస్థితి గరిష్ట స్థాయి వేతనాలు అమలౌతున్న దేశాల్లో లేదు. అందుచేత ఆ దేశాల్లో వేతనాల్లో అసమానతలు తక్కువ మోతాదులో ఉన్నాయి. మూడవ ప్రపంచ దేశాల్లో అత్యధికంగా ఉన్న అసంఘటిత కార్మికులను దోపిడీ చేస్తూ వారి శ్రమను కొల్లగొట్టి పోగేసుకున్న సంపదను సంపన్న దేశాలు తరలించుకుపోతున్నాయి.

ఐఎల్‌వో నివేదిక ప్రపంచవ్యాప్తంగా అమలౌతున్న వేతనాల స్థాయిని పరిశీలించింది. డాలర్ కొనుగోలుశక్తి ప్రపంచంలో ఎక్కడైనా ఒకే స్థాయిలో ఉంటుందన్న ప్రాతిపదికన (డాలర్ పర్చేజింగ్ పవర్ పారిటీ, పిపిపి) వేతనాలను సరిపోల్చింది. అలా చూసినప్పుడు కనిష్ట స్థాయి వేతనాలున్న అత్యధిక మూడవ ప్రపంచ దేశాలలో వేతనాలు 201 డాలర్లు ఉన్నాయి. అదే మధ్య తరహా దేశాల్లోనైతే 630 డాలర్లు ఉన్నాయి. ఇక గరిష్ట స్థాయి దేశాల్లోనైతే వేతనాలు 3333 డాలర్లు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే కనిష్ట స్థాయి దేశాల్లో కార్మికుడి కొనుగోలు శక్తి మధ్యతరహా దేశాల కార్మికుడితో పోల్చితే మూడో వంతు మాత్రమే ఉంది. ఇక గరిష్టస్థాయి దేశాల కార్మికుడితో పోల్చితో మరీ హీనంగా 16వ వంతు మాత్రమే ఉంది! ఎక్కడ కార్మిక శక్తి చౌకగా దొరుకుతుందో అక్కడికి స్వేచ్ఛగా పెట్టుబడి సంచరిస్తోందన్న సత్యం ఈ వాస్తవాలతో మరింత స్పష్టం ఔతోంది. తాము ఏ యే దేశాలకు చెందినవాళ్ళం అన్నదానితో నిమిత్తం లేకుండా ప్రపంచవ్యాప్తంగా కుబేరులందరూ ఒక దగ్గరకు చేరుతున్నారు. ఎక్కడ అతి చౌకగా కార్మికశక్తి లభిస్తోందో ఆ మూడవ ప్రపంచ దేశాల కార్మికుల శ్రమను కొల్లగొడుతున్నారు.

వేతనాలలో నెలకొన్న అసమానతలను ఐఎల్‌వో నివేదిక పరిశీలించింది. ప్రపంచం మొత్తం మీద చూసినప్పుడు 2006 లో నిజవేతనం నెలకు 525 డాలర్లు ఉంటే అది 2021 నాటికి 825 డాలర్లకు పెరిగిందని నివేదిక పేర్కొంది. ఐతే ఇది ప్రపంచం మొత్తాన్ని కలిపి లెక్కించినందువలన వచ్చిన అంకె మాత్రమే. వాస్తవంగా ఆ యా దేశాలను దేనికి దానినే పరిశీలించినప్పుడు వేతనాల్లో అసమానతలు బాగా పెరుగుతున్నాయన్నది తేటతెల్లం ఔతోంది. ఈ అసమానతలు సంపన్న దేశాల్లో 35 శాతం మేరకు తగ్గుముఖం పట్టాయి. అదే మూడవ ప్రపంచదేశాల్లో చూస్తే కేవలం 11 శాతం మాత్రమే తగ్గుముఖం పట్టాయి.

కొత్త టెక్నాలజీని రానున్న కాలంలో పెద్ద ఎత్తున ప్రవేశపెట్టనున్నారు. దీని వలన ఉత్పత్తిలో మానవ శక్తిని వినియోగించవలసిన అవసరం మరింత తగ్గుతుంది. అదే సమయంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతుంది. ఈ ప్రత్యేక నైపుణ్యాన్ని పొందాలంటే అందుకు కావలసిన విద్యను, నిపుణతను పొందగలగాలి. విద్య ప్రైవేటుపరం అయిన అనంతరం ఆర్థిక స్తోమత ఉన్న కొద్దిమంది మాత్రమే ఈ ఆధునిక విద్యను, సాంకేతికతను దొరకబుచ్చుకోగలుగుతారు. తక్కినవారు, అత్యధిక మెజారిటీగా ఉన్నవారు ఈ కొత్త సాంకేతికతకు దూరంగానే మిగిలిపోతారు. వారంతా వేతనాల విషయంలో కనిష్ట స్థాయికి దిగజారిపోతారు.

ఆధునిక సాంకేతికతను, రోబోలను ఎంతగా వినియోగించినప్పటికీ, సూపర్వైజరీ పనులు, సంరక్షణకు సంబంధించిన పనులు (శివు సంరక్షణ, వైద్య సంరక్షణ వగైరా) ఇంటి పనులు వంటివి చేయడానికి మానవ వనరులే అవసరం. అందుకే ఈ రంగాల పనులను అతి తక్కువ వేతనాలతో చేయించుకోడానికి వీలుగా ఈ రంగాల్లో మహిళా కార్మికులను అత్యధికంగా నియోగిస్తున్నారు. కొత్త సాంకేతికత ప్రవేశపెట్టిన ఫలితంగా కొద్దిమంది వేతనాల స్థాయిలో గరిష్టానికి చేరుకున్నా, అత్యధికులు, ముఖ్యంగా మహిళలు కనిష్ట స్థాయికి పడిపోతారు. వేతన అసమానతలతో జెండర్ అసమానతలు కలిసి పెరిగిపోతాయి.

విద్య ప్రైవేటుపరం అయిన అనంతరం ఆర్థిక స్తోమత ఉన్న కొద్దిమంది మాత్రమే ఈ ఆధునిక విద్యను, సాంకేతికతను దొరకబుచ్చుకోగలుగుతారు. తక్కినవారు, అత్యధిక మెజారిటీగా ఉన్నవారు ఈ కొత్త సాంకేతికతకు దూరంగానే మిగిలిపోతారు. వారంతా వేతనాల విషయంలో కనిష్ట స్థాయికి దిగజారిపోతారు. ఆధునిక సాంకేతికతను, రోబోలను ఎంతగా వినియోగించినప్పటికీ, సూపర్వైజరీ పనులు, సంరక్షణకు సంబంధించిన పనులు (శివు) సంరక్షణ, వైద్య సంరక్షణ వగైరా) ఇంటి పనులు వంటివి చేయడానికి మానవ వనరులే అవసరం. అందుకే ఈ రంగాల పనులను అతి తక్కువ వేతనాలతో చేయించుకోడానికి వీలుగా ఈ రంగాల్లో మహిళా కార్మికులను అత్యధికంగా నియోగిస్తున్నారు. కొత్త సాంకేతికత ప్రవేశపెట్టిన ఫలితంగా కొద్దిమంది వేతనాల స్థాయిలో గరిష్టానికి చేరుకున్నా, అత్యధికులు, ముఖ్యంగా మహిళలు కనిష్ట స్థాయికి పడిపోతారు. వేతన అసమానతలతో జెండర్ అసమానతలు కలిసి పెరిగిపోతాయి.

మొత్తం మీద చూసినప్పుడు నిజవేతనాలు పెరిగినట్టు ఐఎల్‌వో నివేదిక చెప్పినప్పటికీ, వేతనాల్లో అసమానతలు వేగంగా పెరగడం అనేది వాస్తవం అన్నది వెల్లడైంది. పెట్టుబడి ఎంత ఎక్కువగా, ఒకే దగ్గర ఎంత వేగంగా పోగుబడుతూ వుంటుందో, అంతే వేగంగా వేతనాల అసమానతలు పెరుగుతూ పోతాయి. దానితోబాటు కార్మికులను ముక్కచెక్కలుగా విడగొట్టడమూ పెరుగతూ పోతుంది. కార్మికశక్తి మీద, ఉత్పత్తి క్రమం మీద పెట్టుబడి రాజకీయంగా పైచేయి సాధించడం వల్లనే ఇది సాధ్యపడుతోంది. ఈ పెట్టుబడి ఆధిక్యతను ప్రతిఘటించి, పెరుగుతున్న అసమానతల నుండి బైట పడాలంటే ముక్కలు ముక్కలుగా ఉన్న కార్మిక వర్గంలో సమిష్టి వర్గ చైతన్యాన్ని పెంపొందించే రాజకీయ ప్రక్రియను వేగవంతం చేయడమే పరిష్కారం.

(స్వేచ్ఛానుసరణ)

ఆడబిడ్డలపై పెరుగుతున్న ఘోరాలు

సమస్య

లెనిన్ అన్విత్

ప్రపంచీకరణ వల్ల వచ్చిన విచ్చలవిడి సంస్కృతి మహిళను వ్యాపార వస్తువుగా మార్చేసింది. ఇంటిలో టీవీలు, బయట భారీ హోర్డింగుల్లో కనిపించే అశ్లీల వ్యాపార ప్రకటనలు యువతను ఎంతగా ప్రభావితం చేస్తున్నా పాలకులకు పట్టడంలేదు. సెల్‌ఫోన్‌లో అనైతిక, అశ్లీల ఆడియోలు, వీడియోలు, రీల్స్‌కు అడ్డు అదుపూ లేదు. బాలురు, యువత అవకాశం వుంటే చాలు సెల్‌ఫోన్‌లో గడిపేస్తున్నారు. ప్రభుత్వాలు చెబుతున్నా నియంత్రణ మాటలకే పరిమితమవుతోంది. టీవీ సీరియళ్లు, సినిమాల్లో ద్వంద్వార్థపు మాటలు, పాటలు పసిపిల్లల మెదళ్ళను విషతుల్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఆదాయం కోసం మద్యం అమ్మకాలు పెంచుతున్నాయి. గంజాయి లాంటి మాదకద్రవ్యాలు పాఠశాలల పిల్లలకు కూడా అందుబాటులో వుంటున్నా వాటి పట్ల కఠిన చర్యలు లేవు. బర్త్‌డేలు, న్యూఇయర్ ఫంక్షన్ల పేరుతో మద్యపానం సేవించడం, రోడ్లపై వికృతంగా ప్రవర్తించడం హీరోయిజం అయ్యింది.



కర్ణుని జన్మ రహస్యం చెప్పడానికి భారతంలో శ్రీకృష్ణుడు వున్నాడు. అది దైవకార్యమని నమ్మించడానికి ఆనాడు భూస్వామ్య వ్యవస్థ వుంది. ఆ ఘోరాన్ని వినసొంపుగా వివరించడానికి నేడు ప్రవచనకారులు వున్నారు. స్వర్ణాంధ్రలో ఒకరు, ఇద్దరు కాదు. ఏకంగా 14 మంది చేసిన ఘోర అకృత్యానికి గాను బిడ్డను మోస్తున్న ఆధునిక కుంతికి భర్త ఎవరు? పుట్టబోతున్న ఆ బిడ్డకు తండ్రి ఎవరు? నిస్సహాయురాలైన బాలికపై క్రూరమృగాల కంటే హీనంగా నెలల కొద్దీ అత్యాచారం, నమ్మిన అమ్మాయి నోట్లో బీర్ బాటిల్ కుక్కి చంపగలిగే దుర్మార్గం, అత్యాచారం చేసి మురికి కాల్వలో తొక్కి చంపగలిగే పైశాచికత్వం, భర్త ఎదురుగానే భార్యను రేప్ చేయగలిగే ధైర్యం నేరగాళ్ళకు ఎక్కడిది? పెరుగుతున్న పైశాచికత్వానికి అంతం ఎప్పుడు? ఆడబిడ్డల కోసమే పుట్టానని, ఎక్కడ అకృత్యం జరిగినా అక్కడ ప్రత్యక్షం అవుతానని చెప్పుకున్న ఉప ముఖ్యమంత్రి అయిన స్వయం ప్రకటిత సనాతన ధర్మ పరిరక్షకుడు ఎక్కడ? ఆటవికమైన ఈ ఘోరాలతో స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమేనా?

శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 14 మంది వాయివరసలు లేకుండా నెలల కొద్దీ అత్యాచారం జరిపారు. నిందితుల్లో తండ్రీకొడుకులు కూడా వుండడం ఆటవికత్వానికి నిదర్శనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజున జరిగిన విజయోత్సవ ర్యాలీలో తప్పెట (దండోరా) కొడుతూ ఆ అమ్మాయి తండ్రి చనిపోయాడు, తల్లి మానసిక వికలాంగురాలు. నిస్సహాయురాలైన ఆ అబలను మాయమాటలతో లొంగదీసుకుని, అత్యాచారం చేసి, వీడియో తీసి వాటిని బయటపెడతామని బెదిరిస్తూ ఈ ఘోరానికి వీరంతా పాల్పడ్డారు. బాలికలో వచ్చిన శారీరక మార్పులు గమనించిన బంధువులు జరిగిన ఘోరాన్ని తెలుసుకుని తల్లడిల్లిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమయిన వారిని ఊరు దాటకుండా నిందితులు అడ్డుకున్నారు. దొంగలకు, రౌడీలకు, హంతకులకు కులం ఏమిటని మన రాష్ట్ర హోంమంత్రి గారు ఇటీవల ప్రకటించారు. బాధితులకు కూడా కులం వుంది. ఆర్థిక స్థితి వుంది. దాన్ని బట్టే శిక్ష అయినా, రక్ష అయినా. ఈ సంఘటన అదే మరోసారి రుజువు చేస్తుంది. బాధితురాలు దళితురాలు కాబట్టే కదా ఆసుపత్రి వరకు మాత్రమే చేరింది. నిందితులు పెత్తందారీ కులాల వారు కాబట్టే కదా; బాధిత కుటుంబం ఊరు దాటకుండా, పోలీసులు ఊరిలోకి రాకుండా అడ్డుకుంది. ఆ కుంతి రాజమాత కావడానికి, ఈ అభినవ కుంతి అనాథగా మారడానికి కారణం అర్థంకాదా?

అనంతపురం నగరంలో ఇంటర్ చదువుతున్న గిరిజన అమ్మాయిని ప్రేమ పేరుతో మోసం చేసి, పెళ్ళి పేరుతో నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తి గురించి తల్లిదండ్రులు పోలీసులకు స్పష్టంగా చెప్పినా సకాలంలో చర్యలు లేవు. దీని ఫలితం నగర శివారు ప్రాంతాల్లో ఆ అమ్మాయి శవంగా మారడం. అమ్మాయి కుటుంబం తన మీద ఫిర్యాదు చేసిందని, పోలీసులు తనను విచారిస్తున్నారని తెలిసి అమ్మాయి నోట్లో బీరు బాటిల్ కుక్కి హత్య చేయగలగడానికి, ఇంతటి కిరాతకుడిని సకాలంలో పోలీసులు గుర్తించకపోవడానికి కారణం ఏమంటారో పాలకులే చెప్పాలి. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో 11 నెలల క్రితం అదృశ్యమైన బాలిక ఈ రోజుకూ కనిపించడంలేదు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం తూముకుంట గ్రామంలో ఎనిమిదేళ్ళ పసికందును 45 ఏళ్ళ వ్యక్తి అత్యాచారం చేసి ఇసుకలో పాతిపెట్టాడు. విజయవాడ ఆటోనగర్‌లో చెత్త ఏరుకునే మహిళకు భోజనం పెడతామని పిలిచి అత్యాచారం చేసి, చంపేశారు. వైఎస్సార్ కడప జిల్లాలో గోపవరం మండలంలో ప్రేమించలేదని ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలు పోసి తగలబెట్టాడో ప్రబుద్ధుడు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురం గ్రామంలో ఆరు సంవత్సరాల పసికందుపై అత్యాచారం చేసి మురికి కాల్వలో తొక్కి చంపేశాడు మరో కిరాతకుడు. ఇంతటి అరాచకాలకు, దుర్మార్గాలకు తెగబడడానికి కారణం ఏమిటో పాలకులకు తెలియదా?

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మహిళల హత్యలు, అత్యాచారాలపై తీవ్రంగా స్పందించే పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి తీరు మారుతుంది. నేరాన్ని బట్టి కాకుండా నేరం చేసిన వారి రాజకీయాలను బట్టి పాలకుల వైఖరులు వుంటున్నాయి. నేర తీవ్రతను తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. పౌర సమాజం స్పందనను, తమ రాజకీయ ప్రయోజనాలను బట్టి కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు కొందరు నిందితులను ఎన్‌కౌంటర్ చేసి చంపేస్తున్నాయి.

అంతమాత్రాన ఈ దుర్మార్గాలు తగ్గడంలేదు సరికదా, ఒకదానికి మించి మరొకటి అత్యంత ఘోరంగా, కిరాతకంగా జరుగుతూనే వున్నాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది 188 మంది బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. అంటే సగటున నెలకు 15 ఘటనలు. ఇందులో అత్యాచారం, హత్యకు గురైన వారు 15 మంది.

గత వైసిపి పాలనలో ఇలాంటి అనేక సంఘటనలు జరిగాయి. పల్నాడు జిల్లా గురజాల రైల్వేస్టేషన్ దగ్గర ఒడిశాకు చెందిన ఓ మహిళపై గ్యాంగ్ రేప్, గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ఓ వివాహితపై అత్యాచారం, హత్య, బాపట్ల జిల్లా రేపల్లె లో వలస కూలీ కుటుంబ మహిళపై సామూహిక అత్యాచారం ఇలా అనేకం జరిగాయి. జగన్ పాలనలో 4,034 మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారని అప్పట్లో తెలుగుదేశం ప్రకటించింది. దేశంలో 2016-2021 మధ్య అత్యాచారాలు 26.35 శాతం పెరిగినట్లు కేంద్ర నేర గణాంకాల శాఖ ప్రకటించింది. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్, తర్వాత రాజస్థాన్, మహారాష్ట్రలు ఇందులో అగ్ర భాగన వున్నాయి. అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా మహిళలు, బాలికలపై ఈ ఘోరాలు పెరగడానికి కారణాలు ఏమిటి?

ప్రపంచీకరణ వల్ల వచ్చిన విచ్చలవిడి సంస్కృతి మహిళను వ్యాపార వస్తువుగా మార్చేసింది. ఇంటిలో టీవీలు, బయట భారీ హోర్డింగుల్లో కనిపించే అశ్లీల వ్యాపార ప్రకటనలు యువతను ఎంతగా ప్రభావితం చేస్తున్నా పాలకులకు పట్టడంలేదు. సెల్‌ఫోన్‌లో అనైతిక, అశ్లీల ఆడియోలు, వీడియోలు, రీల్స్‌కు అడ్డు అదుపూ లేదు. బాలురు, యువత అవకాశం వుంటే చాలు సెల్‌ఫోన్‌లో గడిపేస్తున్నారు. ప్రభుత్వాలు చెబుతున్నా నియంత్రణ మాటలకే పరిమితమవుతోంది. టీవీ సీరియళ్లు, సినిమాల్లో ద్వంద్వార్థపు మాటలు, పాటలు పసిపిల్లల మెదళ్ళను విషతుల్యం చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఆదాయం కోసం మద్యం అమ్మకాలు పెంచుతున్నాయి. గంజాయి లాంటి మాదకద్రవ్యాలు పాఠశాలల పిల్లలకు కూడా అందుబాటులో వుంటున్నా వాటి పట్ల కఠిన చర్యలు లేవు. బర్త్‌డేలు, న్యూఇయర్ ఫంక్షన్ల పేరుతో మద్యపానం సేవించడం, రోడ్లపై వికృతంగా ప్రవర్తించడం హీరోయిజం అయ్యింది.

రాజకీయ పార్టీలు అనుసరించే విధానాలు ఈ హత్యలు, అత్యాచారాలు పెరగడానికి మరో కారణం. మతోన్మాదం తలకెక్కిన ముష్కరులు మత ఘర్షణల సందర్భంగా మహిళల పట్ల ఎంత పాశవికంగా ప్రవర్తిస్తారో బిల్కిస్ బానో పై జరిగిన సామూహిక అత్యాచారం ఒక సజీవ ఉదాహరణ. గర్భాన్ని కోసి పిండాన్ని త్రిశూలంతో పొడిచి హత్య చేసిన సంఘటన, గర్భగుడిలో అభం, శుభం తెలియని బాలికపై అత్యాచారం, హత్య ఉన్మాదానికి పరాకాష్టలు. అధికారంలో వున్న వారు వీరికి అండగా నిలవడం, క్షమాభిక్షలు పెట్టడం, వీధుల్లో ఊరేగింపులు కిరాతకులకు కొండంత బలాన్ని ఇస్తూ రెచ్చిపోయేలా చేస్తున్నాయి. అధికారం అండగా వుంటే చాలు! తాము ఏమి చేసినా చెల్లుతుందని నేరగాళ్ళు బలంగా నమ్మే స్థాయికి మన రాజకీయ, పాలన వ్యవస్థ దిగజారింది.

దళిత, గిరిజన, ఆర్థికంగా వెనుకబడిన మహిళలపై అకృత్యాలకు పాల్పడడానికి తరతరాలుగా మెదళ్లలో పాతుకుపోయిన భూస్వామ్య భావజాలం మరో కారణం. నేరాన్ని బట్టి కాకుండా కులాన్ని బట్టి స్పందించే మనస్తత్వం అన్ని స్థాయిల్లో తరతమ తేడాలతో వుంది. అగ్రకులం వారు చేసిన ఇలాంటి నేరాల్లో అత్యధికం పంచాయితీల పేరుతో ఎక్కడికక్కడ ముగిసిపోతున్నాయి. ఆర్థిక స్థితిని బట్టి అధికారుల స్పందన వుంటుంది. నిందితులు ధనికులైతే వారి వెనుక అధికార పార్టీలు వుంటాయి. దాన్ని బట్టి పోలీసులు, ఇతర అధికారులు ప్రవర్తించే తీరు వుంటుంది. అందుకే నిందితుల్లో చట్టమంటే భయం వుండడంలేదు. నేరం పట్ల పశ్చాత్తాపం లేదు.

సమాజాన్ని అన్ని విధాలా పతనావస్థకు చేరుస్తున్న ప్రపంచీకరణ వ్యాపార సంస్కృతిని ప్రజల్లో వివరించాలి. అందుకు ఆటంకంగా వున్న మతతత్వ, కార్పొరేట్ శక్తులను, పెత్తందారీ రాజకీయాలను ఎదుర్కోవాలి. వేషాల మాటున చేస్తున్న మోసాలను నిలదీయాలి.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

శ్రమ జీవులు

నిరాశ ఎందుకు
నిస్పృహ ఎందుకు
శక్తీ మనదే.. యుక్తీ మనదే
పదండి ముందుకు!
ప్రకృతి మనదే
వనరులు మనవే
సంపద సృష్టించే
శ్రమ జీవులు మనమే
పదండి ముందుకు!
దోపిడి చేసే
పరాన్న భుక్కుల
భరతం పట్టే
పనీ మనదే
పదండి ముందుకు!
ఉన్మాదంతో
విద్వేషాలు, వైషమ్యాలు
పెంచే శక్తుల
కోరలు పీకే
బాధ్యత మనదే
పదండి ముందుకు!
దేశ సమైక్యత
సమగ్రతలను
కాపాడే బాధ్యత మనదే
పదండి ముందుకు!
భారత దేశపు
బహుళత్వాన్నీ
వైవిధ్యాన్నీ
భిన్నత్వంలో
ఏకత్వాన్నీ
సమున్నతంగా
నిలిపేటందుకు
ఐక్యతను
కాపాడేందుకు
పదండి ముందుకు
భవితా మనదే
చరితా మనదే
పదండి ముందుకు..
పదండి ముందుకు!

- మంద ప్రభాకరరావు,
సెల్ : 9441279123

జనసేన రాష్ట్ర కార్యాలయం ఎదుట ఇంజనీర్ల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ శాఖలో అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి బైపాస్ రోడ్‌లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యువ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుమలత, శ్రీను, భాష, యలమంద, హైందవి మాట్లాడారు. ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న తమకు విలువలు కలిగిన ప్రమోషన్ ఛానల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మా పోరాటం ప్రభుత్వంతో కాదని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పెద్దలతో అని అన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా 9,000 మంది ప్రభుత్వ అర్హత కలిగిన డిప్లమో బిటెక్ కేటగిరిలో చేరిన మాకు ఒక్క ఇంజనీరింగ్‌లో ఏడు శాఖలలో ఫ్లక్సర్ విధానాలు అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం వచ్చి ఆరు సంవత్సరాలు అవుతున్నా నేటికి ఏ శాఖ పరిధిలో అనేది తెలియడం లేదని, ప్రమోషన్ చానల్ లేవని చెప్పారు. రెగ్యులేషన్ జిఒ అమలైన సచివాలయాలలో ఒక ఫ్లక్సర్ ఒక ఇంజనీర్‌తో ఐదు శాఖల పనులు చేపిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా జివిఎస్ డబ్ల్యూఎస్ డైరెక్టర్ తెలిపిన విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు, హౌసింగ్, సర్వ శిక్ష అభియాన్, ట్రైబల్ వెల్ఫేర్ లీగల్ మెట్రాలజీ ఇంజనీరింగ్ శాఖలలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఇంజనీర్లు

నిలకడగా సోనియా ఆరోగ్యం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఉదర సంబంధమైన సమస్యతో సర్ గంగారాం ఆస్పత్రిలో ఆమె చికిత్స తీసుకుంటున్న సంగతి తెలిసిందే. 'సోనియా ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ఆస్పత్రిలో చేరారు. ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు' అని గంగారాం ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 78 సంవత్సరాల సోనియా ఈ నెల 9వ తేదిన ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తపోటు అధికం కావడంతో దానికి రెండు రోజుల ముందు సిమ్లాలోని ఇందిరాగాంధీ వైద్య కళాశాలలో కూడా ఆమెకు పరీక్షలు నిర్వహించారు.

ఇలా అయితే వంశ'ధార' ఎలా?

- మూడు జిల్లాలకూ ఒక్కరే ఎస్ఇ -30 జెఇ పోస్టులు ఖాళీ
- కీలక తరుణంలో పోస్టుల భర్తీపై దృష్టిసారించని ప్రభుత్వం
- సాగునీటిపై ప్రభావం చూపే అవకాశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు అత్యంత ప్రధాన సాగునీటి వనరు. వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే ముఖ్యమైన ప్రాజెక్టు. కుడి, ఎడమ కాలువల పరిధిలో 16 మండలాల్లోని రైతులకు ప్రయోజనం కలిగించే సాగు నీటి కల్పతరువు. ఖరీఫ్‌లో జిల్లాలో అత్యధిక శాతం పంటలు సాగు అయ్యేందుకు దోహదపడుతున్న కీలక ప్రాజెక్టుపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార ద్వారా ఈ నెలాఖరులోగా నీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శివారు భూములు తడవాలంటే అతి ముఖ్యమైన పనులు చేపట్టాల్సి ఉంది. ఖరీఫ్ నేపథ్యంలో ప్రస్తుతం కాలువ గట్లు పటిష్ట పరచడం, గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత వంటి పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. పనులన్నీ నామినేషన్ ప్రాతిపదికన సాగునీటి వినియోగదారుల సంఘాలే చేస్తున్నాయి. పనులు ఎలా చేస్తున్నారు? పనుల్లో నాణ్యత ఎంత ఉందనే చూసే పరిస్థితి ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. అందుకు కారణాలు లేకపోలేదు. వంశధారకు రెగ్యులర్ ఎస్ఇ లేకపోవడంతో పాటు 30 మంది జెఇ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా మూడు ఇఇ పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. పనులు ఉధృతంగా సాగుతున్న సమయంలో సిబ్బంది కొరతతో ఎలా నెట్టుకొచ్చేదంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మూడు జిల్లాలకూ ఒక్కరే ఎస్ఇ

వంశధార సర్కిల్ ఎస్ఇగా పనిచేసిన తిరుపతిరావు గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో తోటపల్లి ప్రాజెక్టు రెగ్యులర్ ఎస్ఇగా విధులు నిర్వర్తిస్తున్న స్వర్ణకుమార్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఆయన అదనంగా విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఇ బాధ్యతలనూ నిర్వర్తిస్తున్నారు. దీంతో జిల్లాకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్ల క్లియరెన్స్‌కే సమయమంతా సరిపోతోంది. వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్, హిరమండలం ఎత్తిపోతల పథకం తదితర పనులతో పాటు ఖరీఫ్‌లో సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం కోట్ల రూపాయల నిధులను వెచ్చించి పలురకాల పనులు చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించే అవకాశం లేకుండా పోయింది. అదేవిధంగా హిరమండలం, టెక్కలి డివిజన్లతో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సాగునీటి సమస్యలను పరిశీలించే కీలకమైన జెఇలు 71 మంది పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 41 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల జెఇలకు ఉద్యోగోన్నతులు కల్పించడంతో వారంతా డిఇలు అయి బదిలీ అయ్యారు. వంశధార నీటిని మరికొద్ది రోజుల్లో కాలువలకు విడుదల చేయనున్న నేపథ్యంలో కాలువల్లో నీటి ప్రవాహ పరిస్థితి, నీటి నియంత్రణ వంటి పనులను ఎవరు చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

పనులపై ప్రభావం

వంశధార ప్రాజెక్టు సర్కిల్‌లో ఎస్ఇ, ఇఇలతో పాటు జెఇలు పోస్టులు ఖాళీగా ఉండడంతో పనుల పర్యవేక్షణపై ప్రభావం చూసే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఖరీఫ్ నేపథ్యంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.5.84 కోట్లతో 151 రకాల పనులకు ప్రభుత్వం ఆమోదం తెలపగా రూ.కోటి విలువైన 58 పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వంశధార కాలువ గట్లను పటిష్ట పరచడం, బ్రీచ్‌లను పూడ్చడం తదితర రూ.4.10 కోట్ల విలువైన 117 రకాల పనులను ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో రూ.3.80 కోట్ల విలువైన 113 రకాల పనులు ప్రగతిలో ఉన్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ) రూ.18.26 కోట్ల విలువైన 82 రకాల పనులకు అనుమతి లభించగా, వాటిలో రూ.11.18 కోట్ల విలువైన 51 పనులు ప్రగతిలో ఉన్నాయి. వీటిని సమగ్రంగా పర్యవేక్షించే పరిస్థితి లేకపోవడంతో పనుల నాణ్యత ఎలా ఉంటుందో అనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. ప్రభుత్వం స్పందించి వెంటనే పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వృద్ధురాలి వినూత్న నిరసన

- తహశీల్దార్ కార్యాలయం ముందు వంటచేసిన బాధితురాలు
- తన ఇంటి స్థలానికి హద్దులు చూపాలని వేడుకోలు

ప్రజాశక్తి - గోరంట్ల (సత్యసాయి జిల్లా)

సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కొండాపురం పంచాయతీ రాగి మేకల పల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. తన సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవటంతో కార్యాలయం ముందే వంట చేసి నిరసన వ్యక్తం చేసింది. దీంతో అధికారులు దిగొచ్చారు. మంగళవారం గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తామని వృద్ధురాలికి తహశీల్దార్ హామీతో కూడిన నోటీసును అందజేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు..

వంట చేస్తున్న వృద్ధురాలు

మండలంలోని కొండాపురం పంచాయతీ రాగిమేకలపల్లి గ్రామానికి వడ్డే వెంకటలక్ష్మమ్మ అనే వృద్ధురాలు నివసిస్తున్నారు. ఆమెకు సర్వే నెంబర్ 150 -3లో ఇంటి పట్టా ఉంది. ఈ స్థలానికి సంబంధించి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. అయితే అధికారులు ఎవరూ స్పందించలేదు. నెలరోజులుగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోలేదు. విసిగిపోయిన వెంకటలక్ష్మమ్మ సోమవారం నిరసనను దిగారు. తనతో పాటు తెచ్చుకున్న వంటపాత్రలతో తహశీల్దార్ కార్యాలయం ముందు పొయ్యి ఏర్పాటు చేసి వంట చేశారు. దెబ్బకు అధికారులు దిగొచ్చారు. మంగళవారం గ్రామానికి వచ్చి ఇంటిస్థలం కొలిచి హద్దులు చూపిస్తామని తహశీల్దార్ మారుతి బాధితురాలికి హామీతో కూడిన నోటీసును అందజేశారు.

నకిలీ రెవెన్యూ రికార్డులు, ఇంటి పట్టాలు

- రాయచోటి, శిబ్యాలలో పోలీసులు, రెవెన్యూ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-రాయచోటి

నకిలీ రెవెన్యూ రికార్డులు, డికెటి పట్టాలు తయారు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది ఇళ్లలో రెవెన్యూ, పోలీసు అధికారులు సోమవారం సాయంత్రం సోదాలు చేపట్టారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లాలో సంచలనం రేకెత్తించింది. రెవెన్యూ అధికారులు భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు అందింది. అందిన ఫిర్యాదు ఆధారంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రెవెన్యూ అధికారులపై తనిఖీలు చేపట్టాలంటూ రెవెన్యూ, పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో నివాసముంటున్న సుండుపల్లి డిప్యూటీ తహశీల్దార్ యునీత్ కుమార్‌రెడ్డి, అతని ముఖ్య అనుచరుడు ఖాదర్‌వలీ నివాసాలతోపాటు శిబ్యాల గ్రామంలో ఉన్న మాజీ విఆర్ఒ నాగరాజు నివాసంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ముమ్మరంగా సోదాలు చేపట్టారు. ఈ సోదాలలో రెవెన్యూ అధికారుల నుంచి భారీ స్థాయిలో నకిలీ ఇంటి పట్టాలు, వన్‌బిలు, అడంగల్లు, పాసు పుస్తకాలతోపాటు రెవెన్యూకు సంబంధించిన విలువైన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డిప్యూటీ తహశీల్దార్ యునీత్ కుమార్‌రెడ్డి గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాయచోటి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసి అంతా తానై అన్నట్లుగా వ్యవహరించారు. ఆ సమయంలో రాయచోటి తహశీల్దార్ కార్యాలయంలో విలువైన రెవెన్యూ రికార్డులు మాయమయ్యాయని అప్పట్లోనే ప్రచారం జరిగింది. సాధారణ బదిలీలలో భాగంగా కలెక్టర్ ఆదేశాలను పలుమార్లు లెక్క చేయకపోవడంతో యునీత్ కుమార్‌రెడ్డిని అధికారులు సస్పెండ్ చేశారు. సస్పెండ్ గడువు ముగియడంతో ఇటీవలే ఆయన కె.వి.పల్లి మండలం నుంచి సుండుపల్లి మండలానికి రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు.

పేదలపై జెసి కన్నెర్ర..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

రుణగ్రహీత పేరు: (1) మెసర్స్ విహాన్ అగ్రొ ప్రాడక్ట్స్, ప్రతినిధియైన దీని పార్టనర్స్ (ఎ) శ్రీమతి బయ్యారపు రత్నశ్రీ (మేనేజింగ్ పార్టనర్), కేరాఫ్ ఎం. రవి కుమార్, ఫ్లాట్ నం.502, శ్రీ కేశవ హైట్స్, ప్రియ చిల్డ్రన్స్ హాస్పిటల్ దగ్గర, పటమట, విజయవాడ-520010. (బి) పులిమద్ది చిన్న మస్తాన్ (పార్టనర్), డోర్ నం.53-126ఎ, 7వ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, అరుల్ నగర్, గునదాల, విజయవాడ, కృష్ణా-520004. ఆఫీసు చిరునామా: ప్లాట్ నం.59/ఎ-21/4-4/5, 1వ లేన్, పంట కాలువ రోడ్ దగ్గర, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లాంత-520010.
హామీదారు/ తాకట్టుదారు: (1) శ్రీ వుప్పల సాంబశివ రావు, వుప్పల నాగేంద్ర రావు, 4-100, అచ్చుతాపురం పోస్టు, బొర్రవారిపాలెం, కూచిపూడి, గుంటూరు-522262.
డియర్ సర్/ మేడం,
1. మీ విజ్ఞప్తి మేరకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సూర్యారావుపేట్ బ్రాంచి మీకు దిగువ రుణాలు మంజూరుచేసింది:
మెసర్స్ విహాన్ అగ్రొ ప్రాడక్ట్స్ కు టర్మ్ లోన్ మరియు క్యాష్ క్రెడిట్ సదుపాయం. మీకు నం.1కు మంజూరుచేసిన రుణ సదుపాయలకు సంబంధించి లేదా దిగువ బకాయిలను తిరిగి చెల్లించుటలో మీరు నం.లు 2 హామీదారు మరియు తాకట్టుదారుగా ఉన్నారు.
2. రుణ సదుపాయాలు, బ్యాంకు పేరున చార్జ్‌చేసిన సెక్యూరిటీస్ మరియు ప్రస్తుత బకాయి మొత్తాల వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

క్ర. సం.	రుణ సదుపాయం స్వభావం& మొత్తాలు	సెక్యూరిటీస్	03.06.2025నాటికి ప్రస్తుత బకాయి మొత్తాలు (వాస్తవంగా రూ.లలో)
1	క్యాష్ క్రెడిట్ ఫర్ రూ.60,00,000/- (రూపాయలు అరవై లక్షలు మాత్రమే) ఖాతా నం. 60424686965.	ప్రైమరీ సెక్యూరిటీ: స్టాక్ & రిసీవబుల్స్ యొక్క హైపోతికేషన్. కొల్లేటరల్ సెక్యూరిటీ: కమర్షియల్ ల్యాండ్ & భవనము యొక్క ఈక్విటేబుల్ తాకట్టు.	రూ. 60,95,418/- (రూపాయలు అరవై లక్షల తొంబై ఐదు వేల నాలుగు వందల పద్దెనిమిది మాత్రమే) ప్లస్ 04.06.2025 నుండి వర్తించుతూ వర్తించు రేటు ప్రకారం అమలుచేయని వడ్డీ/ తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చులు& ఇతర వ్యయాలు మొ॥నవి.
2	టర్మ్ లోన్ ఫర్ రూ.10,00,000/- (రూపాయలు పది లక్షలు మాత్రమే) ఖాతా నం. 60424749279.	ప్రైమరీ సెక్యూరిటీ: బ్యాంక్ ఫైనాన్స్ కాకుండా కొన్న వాహనం యొక్క హైపోతికేషన్. కొల్లేటరల్ సెక్యూరిటీ: కమర్షియల్ ల్యాండ్ & భవనము యొక్క ఈక్విటేబుల్ తాకట్టు.	రూ.8,09,207/- (రూపాయలు ఎనిమిది లక్షల తొమ్మిది వేల రెండు వందల ఏడు మాత్రమే) ప్లస్ 04.06.2025 నుండి వర్తించుతూ వర్తించు రేటు ప్రకారం అమలుచేయని వడ్డీ/ తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చులు& ఇతర వ్యయాలు మొ॥నవి.

మొత్తం: రూ.69,04,625/- (రూపాయలు అరవై తొమ్మిది లక్షల నాలుగు వేల ఆరు వందల ఇరువై ఐదు మాత్రమే) ప్లస్ 04.06.2025 నుండి వర్తించుతూ వర్తించు రేటు ప్రకారం అమలుచేయని వడ్డీ/ తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చులు& ఇతర వ్యయాలు మొ॥నవి.
డిమాండ్ నోటీసు తేది: 03.06.2025 | ఎన్‌పిఏ తేది: 30.05.2025
క్రియేషన్ ఆఫ్ చార్జెస్ వివరాలు దిగువ విధంగా:
హైపోతికేషన్:
(ఎ) ఎగ్జిక్యూటంట్స్ పేరు: మెసర్స్ విహాన్ అగ్రొ ప్రాడక్ట్స్, ప్రతినిధియైన దీని పార్టనర్స్
(బి) చార్జి స్వభావం: హైపోతికేషన్
(సి) సెక్యూరిటీ వివరణ: స్టాక్ & రిసీవబుల్స్ యొక్క హైపోతికేషన్ మరియు బ్యాంకు ఫైనాన్స్ కాకుండా కొనుగోలుచేసిన వాహనాల హైపోతికేషన్.
తాకట్టు:
(ఎ) ఎగ్జిక్యూటంట్స్ పేరు: శ్రీ వుప్పల సాంబశివ రావు
(బి) చార్జి స్వభావం: కమర్షియల్ ల్యాండ్ & భవనము యొక్క ఈక్విటేబుల్ తాకట్టు.
(సి) సెక్యూరిటీ వివరణ:
చిరునామా: డోర్ నం. 404/3, ఈదుపల్లి, డోర్ నం. 2-30, అసెస్మెంట్ నం.211, రేపల్లె నుండి నిజాంపట్నం రోడ్‌కు ప్రక్కన, ఈదుపల్లి గ్రామ పంచాయతి, నాగారం మండలం, గుంటూరు జిల్లా.
తాకట్టుపెట్టిన వారు: హామీదారుచేత తాకట్టుపెట్టబడినది, తాకట్టుదారు: వుప్పల సాంబశివ రావు.
సబ్-రిజిస్ట్రార్ మంతెనవారిపాలెం పరిధిలో మరియు సిటిఎస్/ సర్వే నం.లు అందుబాటులో లేవు మరియు 1087.92చ.గ.ల విస్తీర్ణంతో రిజిస్ట్రేషన్ జిల్లా బాపట్ల, సబ్-డిస్ట్రిక్ట్ బాపట్ల లో ఈదుపల్లి గ్రామం వద్దగల ల్యాండ్ యొక్క మొత్తం భాగం. మరియు సరిహద్దులు: ఉత్తరం వైపు: ఉప్పల రాజ్య లక్ష్మి ఆస్తి, తూర్పు వైపు: యాసం నాంచారయ్య ఆస్తి, పడమర వైపు: రేపల్లె మెయిన్ డ్రైన్, దక్షిణం వైపు: 70" వెడల్పు బి.టి.రోడ్డు.
సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు పై చెప్పినట్లుగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సూర్యారావుపేట్ శాఖకు చెల్లింపులుచేయుటలో విఫలం చెందినట్లైతే, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సూర్యారావుపేట్ శాఖ వారు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు వర్తించదు రూల్స్ పై సెక్యూర్డ్ అసెట్స్ పై చర్యలుతీసుకొనుట ప్రారంభించింది, సంబంధిత రు ణగ్రహీతలు/ హామీదారులు పూర్తి బాధ్యత పైననే సార్ఫసీ యాక్ట్ యొక్క నియమాలలో, సంబంధిత రుణగ్రహీతలు/ హామీదారులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సూర్యారావుపేట్ శాఖ వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలలో బదిలీచేయలేరు. ఏవేని ఉలంఘనలు జరిగిన సార్ఫసీ యాక్ట్‌తో అనుసరించి, సంబంధిత వ్యక్తులకు శిక్ష లేదా జరిమానా మరియు రెండూను విధించబడు ఆస్కారం ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించు కొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలకు రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. బట్వాడా కాకుండా వెనుదిరిగిన నోటీసులను క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును. ఈ నోటీసు ప్రచురించబడుచున్నది.
తేది: 16.06.2025 — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ. — డిప్యూటీ జోనల్ మేనేజర్, జోనల్ ఆఫీసు, విజయవాడ.

ఎంఎస్‌పిని నిర్ణయించే కమిషన్‌తో సమావేశమైన రైతు సంఘాలు నాయకులు

ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని సిఫార్సు చేయాలి

- సిఎసిపిను కోరిన రైతు సంఘాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సి2ం50 శాతం వద్ద అన్ని పంటల సేకరణకు చట్టపరమైన హామీని సిఫార్సు చేయాలని ఎంఎస్‌పిని నిర్ణయించే కమిషన్‌ను రైతు సంఘాలు కోరాయి. సోమవారం నాడిక్కడ డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సిఎసిపి) చైర్మన్ ప్రొఫెసర్ విజయ్ పాల్ శర్మ అధ్యక్షత 2025-26 మార్కెటింగ్ సీజన్ రబీ పంటలకు ధరల విధానంపై సమావేశం జరిగింది. గత రెండేళ్లలో గోధుమ ఉత్పత్తిలో స్తబ్దత, క్షీణతపై చైర్మన్ ప్రొఫెసర్ విజయ్ పాల్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి హాజరైన రైతు సంఘాల నేతలు సిఎసిపిను చట్టబద్ధమైన సంస్థగా మార్చాలని కోరారు. ఎ2ంఎఫ్ఎల్, సి2ం50 శాతం మధ్య వ్యత్యాసం, సేకరణ పరిమాణం, లబ్ధిదారుల సంఖ్యను స్పష్టం చేయడానికి ఎంఎస్‌పిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగాన్ని ఖచ్చితంగా నిరోధించాలని కోరారు. ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి శాస్త్రీయ వ్యవసాయాన్ని నిర్ధారించాలని సూచించారు. ఎఐకెఎస్ ప్రతినిధులు పి. కృష్ణప్రసాద్, నిధీష్ విల్లాట్ మాట్లాడుతూ దేశమంతటా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకుంటున్న సమయంలో ఎదుర్కొన్న నష్టాలను కవర్ చేయడానికి, ఖరీఫ్, రబీ పంటలకు ఎంఎస్‌పి నిర్ణయించడానికి సిఎసిపి ఆమోదించిన ఎ2ంఎఫ్ఎల్ ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం దాచిపెడుతోందని విమర్శించారు. ఉదాహరణకు, ఇటీవల ప్రకటించిన ఖరీఫ్ పంటలలో సి2ం 50 శాతం ప్రమాణాల ప్రకారం వరి ఎంఎస్‌పి క్వింటాకు రూ. 766 తక్కువగా ఉందని, అందువల్ల, ఎకరానికి 25 నుండి 30 క్వింటాళ్ల వరకు ఉత్పాదకత కలిగిన ఒక ఎకరం రైతు రూ. 19,000 నుండి రూ. 22,000 వరకు నష్టపోయాడని వివరించారు. ఈ నష్టం ఏడాది ఇచ్చే ప్రధానమంత్రి సమ్మాన్ నిధి రూ. 6000 కంటే మూడు రెట్లు ఎక్కువ పేర్కొన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల బిజెపి మ్యానిఫెస్టో సి2ం50 శాతం వద్ద ఎంఎస్‌పి అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే, 11 ఏళ్ల అధికారంలో ఉన్న తరువాత కూడా మోడీ ప్రభుత్వం వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. వాస్తవానికి, దేశవ్యాప్తంగా ప్రభుత్వ సేకరణ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రకటించిన ఎంఎస్‌పి రేటు నుండి 10 శాతం కంటే తక్కువ మంది రైతులు మాత్రమే ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంలో సిఎసిపి ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని, ఎ2ంఎఫ్ఎల్, సి2ం50 శాతం మధ్య ప్రమాణాలలో వ్యత్యాసాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలు సేకరించిన పంటల పరిమాణాన్ని, మోడీ ప్రభుత్వ హయాంలో గత 11 ఏళ్లలో ప్రయోజనం పొందిన రైతుల సంఖ్యను వివరించాలని పునరుద్ఘాటించారు. నేల సారాన్ని దెబ్బతీసే, ఉత్పత్తి ఖర్చులను పెంచే ఇన్‌పుట్‌ల అధిక వినియోగం గురించి లేవనెత్తారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో శ్రీనగర్-బెలాటల్ రోడ్డులోని ననోరా గ్రామం సమీపంలో వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. సుమారు 20 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ఆ తర్వాత రెండు వాహనాలు రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడ్డాయి. కాగా, బైక్‌పై ప్రయాణించిన ఇద్దరు, కారులో ఉన్న ముగ్గురు ఈ ప్రమాదంలో మరణించారు.

కారులో ప్రయాణించిన మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కారు టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోడీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం

నికోసియా : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైప్రస్ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3' అందుకున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఈ పురస్కారాన్ని మోడీకి ప్రదానం చేశారు. ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3 అవార్డు సైప్రస్ మొదటి అధ్యక్షుడు ఆర్చ్ బిషప్ మకారియోస్ 3 పేరు మీద దేశం అందించే అత్యున్నత బిరుదు. ఈ పురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా ఉందని, దీనిని రెండు దేశాల మధ్య స్నేహానికి అంకితం చేస్తున్నానని అవార్డు అందుకున్న తర్వాత ప్రధాని పేర్కొన్నారు. ఇది 140 కోట్ల భారతీయులకు దక్కిన గౌరవమని, రెండు దేశాల సంస్కృతి, సోదరభావం, వసుధైక కుటుంబం అన్న భావనకు ప్రతీక అని అన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల భాగస్వామ్యం అత్యున్నత శిఖరాలకు చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల పురోగతిని బలోపేతం చేయడమే కాకుండా శాంతియుత మరియు సురక్షితమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు దోహదపడతామని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఆదివారం సైప్రస్ చేరుకున్నారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. మెడిటెర్రానియన్ ప్రాంతంలోనూ, యూరోపియన్ యూనియన్‌లోనూ భారత్‌కు సైప్రస్ సన్నిహిత స్నేహితునిగా, ముఖ్య భాగస్వామిగా కొనసాగుతోంది. భారత్, సైప్రస్ మధ్య సోమవారం పలు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఇవి దోహదపడతాయని అధికారులు తెలిపారు. సైప్రస్ నుండి నేరుగా ప్రధాని కెనడాకు బయలుదేరారు.

కుల గణన ప్రస్తావన ఏది ?

- జనగణన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ విమర్శలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో :

జనాభా లెక్కలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సోమవారం జారీ చేసిన నోటిఫికేషన్ పేలవంగా ఉందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. జనాభా లెక్కల్లో కుల గణణ చేర్చడంలో కేంద్రం మౌనంగా ఉందని విమర్శించింది. ఇది ప్రభుత్వం మరో యూ-టర్న్ కాదా? అని ప్రశ్నించింది. కుల గణను మాత్రమే కాకుండా కులాల వారీగా సామాజిక-ఆర్థిక పారామితులపై వివరణాత్మక డేటా తెలిసేలా తెలంగాణ మోడల్‌ను అనుసరించాలని సూచించింది. 2026-27లో జరుగనున్న జనాభా లెక్కలకు సంబంధించి గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ తరహాలోనే ఉందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. తాజా నోటిఫికేషన్ చూస్తే.. ఇది కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుందని, 2025 ఏప్రిల్ 30న జారీ చేసిన నోటిఫికేషన్‌ను పునరుద్ఘాటించిందన్నారు. ప్రతిపక్షాల డిమాండ్, ఒత్తిడి కారణంగా ప్రధానమంత్రి కుల గణన డిమాండ్‌కు తలొగ్గారని..కేంద్రమే కుల గణన చేస్తామని ప్రకటించిందని.. తాజా నోటిఫికేషన్‌లో కుల గణన గురించి ప్రస్తావించలేదన్నారు. కుల గణణ మాత్రమే కాకుండా.. కులాల వారీగా సామాజిక, ఆర్థిక పరిస్థితికి సంబంధించి వివరణాత్మక సమాచారం సేకరించాలన్నారు. తెలంగాణలో జరిగిన కుల గణనలో 56 ప్రశ్నలు అడిగారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 56 అంగుళాల ఛాతీ ఉందని చెప్పుకునే వ్యక్తికి 16వ జనాభా లెక్కల్లో 56 ప్రశ్నలు అడిగేంత అవగాహన.. ధైర్యం ఉందా? అనేది ప్రశ్న అన్నారు. కేంద్రం సోమవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో కొత్తగా ఏముందని ప్రశ్నించారు. జమ్మూకాశ్మీర్, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో 2026 అక్టోబర్‌లో, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో 2027 మార్చిలో జనాభా లెక్కలు జరుగుతాయని అందులో ఉందని.. జనాభా లెక్కల గురించి మాత్రమే ఉందని.. కులం గురించి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు.

టెహరాన్ వీడండి

- ఇజ్రాయిల్ మిలటరీ హెచ్చరిక
- ఇరాన్ ప్రభుత్వ టివి కార్యాలయంపై దాడులు
- ఉధృతంగా కొనసాగుతున్న దాడులు
- ఇప్పటివరకు 220మందికి పైగా మృతి

టెల్‌అవీవ్‌లో ఇరాన్ దాడుల కారణంగా చెలరేగుతున్న మంటలు

టెల్ అవీవ్, టెహరాన్ : ఇరాన్ రాజధాని టెహరాన్‌పై మరిన్ని దాడులు జరుగుతాయని ఇజ్రాయిల్ కొత్తగా హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ టివి కార్యాలయంపై దాడులు జరిగాయి. ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ ఐఆర్ఐబిపై బాంబుదాడులు జరిగిన వెంటనే లైవ్‌లో వున్న ప్రెజంటర్ స్టూడియో నుండి పారిపోతున్న దృశ్యాలు కనిపించాయి. పెద్ద పేలుడు శబ్దం కూడా వినిపించింది. అయితే కాసేపటికి పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత మళ్ళీ చానెల్ ప్రసారాలు ఆరంభమయ్యాయి. మరోవైపు టెహరాన్ వ్యాప్తంగా పలుచోట్ల పేలుళ్ళ శబ్దాలు వినిపిస్తున్నాయి. తూర్పు, పశ్చిమ టెహరాన్‌ల్లో పలు లక్ష్యాలపై దాడులు జరుగుతున్నాయి. వీటిలో పశ్చిమ టెహరాన్‌లోని మిలటరీ స్థావరంపైనా దాడి జరిగిందని ఇరాన్ మీడియా తెలిపింది. ఇప్పటివరకు ఇరాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మృతుల సంఖ్య 220 దాటింది. వీరిలో 70మంది మహిళలు, పిల్లలు వున్నారు. ఆదివారం నాటి దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్, మరో ఇద్దరు సైనిక జనరల్స్ మృతి చెందారు.

ఇరాన్‌లోని నటాంజ్ యురేనియం శుద్ధి కర్మాగారానికి మరింతగా నష్టం వాటిల్లుతున్న సూచనలేమీ లేవని ఐక్యరాజ్య సమితి అణు పర్యవేక్షక సంస్థ రాఫెల్ గ్రాసి చెప్పారు. ఆస్పత్రులు, నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ విచక్షణారహితంగా దాడులు జరుపుతోందని, ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని, యుద్ధ నేరం కిందకే వస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కెర్మాన్‌షాలోని ఫారాబి ఆస్పత్రి లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు జరిపిందని, దీంతో ఆస్పత్రిలో కొంత భాగం ధ్వంసమైందని ఇరాన్ మీడియా తెలిపింది. విరిగిన గాజు తలుపులు, కిటికీలు, నెత్తురోడుతున్న నేతలు, చిందరవందరగా పడిన పరికరాలు అక్కడ వాతావరణం భయానకంగా వుందని మీడియా వార్తలు తెలిపాయి.

టెహరాన్ వీడండి

టెహరాన్ గగనతలంపై పూర్తిగా పట్టు సాధించామని, విజయానికి చేరువలో వున్నామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు చెప్పుకున్నారు. రక్షణమంత్రి ఇజ్రాయిల్ కట్జ్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్‌లతో కలిసి సెంట్రల్ ఇజ్రాయిల్‌లోని టెల్‌నోఫ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అణు ముప్పును నిర్మూలించడం, క్షిపణి ముప్పును తుదముట్టించడం ఈ రెండు తమ లక్ష్యాలని చెప్పారు. తక్షణమే రాజధాని టెహరాన్‌ను వీడాలని ఆయన ప్రజలను హెచ్చరించారు. తాము తాజా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెహరాన్‌లో కమాండ్ సెంటర్లపై దాడి చేశామని ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. తమ పౌరులపై దాడులు జరిపితే ఇరాన్ అందుకు భారీగా మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు.

మధ్యవర్తిత్వం నెరపండి

ఇరాన్‌తో తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించేలా ఇజ్రాయిల్‌ను ఒప్పించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా కతార్, సౌదీ అరేబియా, ఒమన్‌లను ఇరాన్ కోరింది. తద్వారా ఇరాన్ కూడా అమెరికాతో అణు చర్చలకు సిద్ధమవుతుందని తెలిపింది. ఆదివారమంతా పరస్పరం మాట్లాడుకుంటూ, ఇరాన్‌తో మాట్లాడుతూ గల్ఫ్ నేతలకు బిజీగా గడిచింది. ఇరాన్‌కు ఆత్మ రక్షణ కోసం చర్యలు తీసుకునే హక్కు వుందని రష్యా స్పష్టం చేసింది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలకు స్వస్తి పలకడానికి దౌత్య చర్యలు అవసరమని టర్కీ నేత ఎర్డొగన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇరువురు ఫోన్‌లో మాట్లాడుకున్నారు.

మరోవైపు ఇజ్రాయిల్ అత్యంత దూకుడుగా పాల్పడుతున్న దాడులను ఇరాన్ సమర్ధవంతంగా తిప్పికొడుతోంది. ఈ సందర్భంగా టెల్ అవీవ్‌లోని అమెరికా ఎంబసీకి స్వల్పంగా నష్టం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, టెహరాన్‌లో పరిస్థితులు దారుణంగా మారుతుండడంతో భారత్ అక్కడి తన పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది.

ఇరాన్ దాడులతో ఐరన్ డోమ్ కు బీటలు

- ఇజ్రాయిల్ అంచనాలు తలకిందులు
- ఐరన్ డోమ్ సామర్థ్యం పై అనేక అనుమానాలు

టెల్ అవీవ్ : ఇరాన్ దాడులతో ఐరన్ డోమ్ బీటలు వారింది. ఇజ్రాయిల్ యొక్క ఐరన్ డోమ్ ప్రపంచంలో అత్యంత అధునాతన వైమానిక రక్షణ వ్యవస్థలలో ఒకటని.ఇది రాకెట్లు, క్షిపణులు, ఇతర వైమానిక దాడుల ను సమర్ధవంతం గా అడ్డుకుంటుంద నే ప్రచారం ఇరాన్ క్షిపణి దాడులతో పటాపంచలు అయిపోయింది. ఇజ్రాయిల్ దాడులకు ఆత్మరక్షణ లో భాగంగా ఇరాన్ 100 కంటే ఎక్కువ క్షిపణులతో చేసిన దాడిని ఐరన్ డోమ్ తట్టుకోలేకపోయింది.ఈ దాడులను పూర్తి స్థాయిలో అడ్డుకోలేకపోయిందని,ఇందులో సాంకేతిక లోపాలు, ఇంటర్ సెప్టర్ మిస్సైళ్ల స్టాక్ తగ్గిపోవడం వంటి పలు లోపాలున్నాయని మీడియా కథనాలు తెలిపాయి.ఇరాన్ దాడుల సమయంలో ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ఇజ్రాయిల్ అప్రమత్త సైరన్‌లు మోగించింది, ప్రజలు బంకర్లలో దాక్కున్న పరిస్థితి.ఈ సంఘటనలు ఐరన్ డోమ్ యొక్క సామర్థ్యంపై అనుమానాలను రేకెత్తించాయి. కొందరు విశ్లేషకులు ఈ వ్యవస్థ అధిక సంఖ్యలో క్షిపణులను ఒకేసారి ఎదుర్కోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. ఐరన్ డోమ్ అనేది ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఎఐ), రాఫెల్ అడ్వాన్స్ డిఫెన్స్ సిస్టమ్స్ లు సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఒక బహుళ స్థాయి రక్షణ వ్యవస్థ. ఇది షార్ట్ రేంజ్ రాకెట్లు,ఆర్టిలరీ షెల్స్,డ్రోన్‌ల దాడులను గుర్తించి, ట్రాక్ చేసి నాశనం చేయగలదని.ఇది 90% విజయవంతమైనదని ఇజ్రాయిల్ రక్షణ శాఖ ప్రకటించింది.కాని ఇరాన్ దాడులతో ఇజ్రాయిల్ అంచనాలు తలక్రిందులయ్యాయి.అయితే ఐరన్ డోమ్ ,మోస్సాద్ వంటి ఇంటిలిజెన్స్ వ్యవస్తల బలంతో పాటు అమెరికా దన్నుతో ఇజ్రాయిల్ పేట్రేగిపోయిందని, దాడులకు తెగబడుతుందని అనేక వర్గాలు విమర్శిస్తున్నాయి.

యుద్ధాన్ని మేము కోరుకోవడం లేదు.

- అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోంది
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్

టెహ్రాన్: యుద్ధాన్ని మేము కోరుకోవడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటించారు.సోమవారం పార్లమెంట్ సమావేశాలు జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తుందని, ఇజ్రాయిల్ దురాక్రమన కు మద్దతు తెలుపుతుందన్నారు. మా కమాండర్ లను,శాస్త్రవేత్తలను హత్య చేసిందని,శాస్త్రవేత్తలు ఏ నేరం చేశారని ప్రశ్నించారు. మా దేశ ప్రయోజనాలకు అనుగుణంగా,ఇతర అవసరాల కోసం అణు పరిశోధనలు చేసుకునే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. ఇరానీయులందరూ ఐక్యతతో జియోనిస్టు మారణకాండను ఎదుర్కోవాలన్నారు.మేము దురాక్రమణదారులం కాదని.యుద్ధాన్ని మేం ప్రారంభించలేదని, ఇరానీయులు శాంతి,సామాజిక న్యాయం,అభివృద్ధి కోసం పోరాడతారని ఈ సంధర్భంగా తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఇజ్రాయిల్ చేసిన దాడిలో 224 మంది ఇరాన పౌరులు చనిపోయారు.మరో 1200 మంది కి పైగా గాయపడ్డారని అదికార వర్గాలు తెలిపాయి.

గాజా ఆహార కేంద్రాలపై కాల్పులు

- 38 మంది పాలస్తీనియన్ల మృతి
- ఇజ్రాయిల్ దాష్టికాలను ఖండించిన ఐక్యరాజ్య సమితి

గాజా : గాజాలో పాలస్తీనియన్లకు ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాలపై ఇజ్రాయిల్ సోమవారం మరోసారి దాడులకు తెగబడింది. రఫా సమీపంలోని సహాయ కేంద్రాల వద్ద ఆహారం కోసం వేచి వున్న వారిపై ఇజ్రాయిల్ దళాలు జరిపిన కాల్పుల్లో 38 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

గాజాకు అందుతున్న మానవతావాద సాయాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు జరుపుతున్న విషయం తెలిసిందే. గాజాలో ఆహార సంక్షోభం తీవ్రమవుతోంది. నిస్సహాయులైన పాలస్తీనియన్లు ఆకలి బాధతో సహాయ కేంద్రాల వద్ద వేలాదిగా బారులు తీరుతున్నారు. వారిని చెదరగొట్టేందుకు, నియంత్రించేందుకు ఇజ్రాయిల్ దళాలు కాల్పులు జరిపాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అమెరికా, ఇజ్రాయిల్ మద్దతుతో ఈ సహాయ కేంద్రాలను వివాదాస్పద గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) నిర్వహిస్తోంది. కాగా ఉత్తర గాజాలో ఆహారం కోసం వేచివున్న మరో ముగ్గురు కూడా ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయారు. గాజా నగరంపై జరిగిన దాడిలో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

భయానకం : ఐక్యరాజ్య సమితి

గాజాలో ఇజ్రాయిల్ దాష్టికాలను ఐరాస హక్కుల విభాగం అధిపతి ఓల్కర్ టర్క్ తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్ చర్య భయానకంగా ఉన్నదని, ఆహారం కోసం అలమటిస్తూ, నిస్సహాయులైన పాలస్తీనియన్లపై వరుసగా దాడులు చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఆహారాన్ని ఇజ్రాయిల్ ఒక ఆయుధంగా వాడుతోందని విమర్శించారు. ప్రాణాధార సామగ్రిని అడ్డుకోవడాన్ని ఖండించారు. ఇజ్రాయిల్ జరుపుతున్న ఈ క్రూరమైన దాడులపై తక్షణమే నిష్పాక్షిక విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా గత 20మాసాలుగా కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాడుల్లో 55,362 మంది చనిపోయారని, వీరిలో వేలాది మంది చిన్నారులు కూడా ఉన్నారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఆహారం, మందులు, ఇతర అత్యవసర సామగ్రి రవాణాపై విధించిన ఆంక్షలను ఇజ్రాయిల్ పాక్షికంగా ఎత్తివేయడంతో గత నెల చివరి నుండి జీహెచ్ఎఫ్ వాటి పంపిణీని ప్రారంభించింది. అయితే ఐరాస, ఇతర మానవతావాద గ్రూపులు జీహెచ్ఎఫ్‌కు సహకరించేందుకు నిరాకరించాయి. మానవతావాద అవసరాల కంటే ఇజ్రాయిల్ సైనిక లక్ష్యాలకే అది ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించాయి.

అహ్మదాబాద్ ఘటనపై ప్రస్తుత దర్యాప్తును నీరు గార్చొద్దు

- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా 171 విమానం కూలిపోయిన విషాద ఘటనకు సంబంధించి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసిఎఒ) రూపొందించిన అంతర్జాతీయ ప్రొటోకాల్స్, నిబంధనల ప్రకారం భారత్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) తన స్వతంత్ర దర్యాప్తును ప్రారంభించింది. విమానం కూలిపోవడానికి దారి తీసిన కారణాలు, పరిస్థితులపై విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగా, ఎఎఐబి, విమానం బ్లాక్ బాక్స్‌లను, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకోనుంది. సంబంధిత అంతర్జాతీయ సంస్థలు, విమానం, ఇంజన్ తయారీదారులు, ఇతర పక్షాల సహకారంతో తన దర్యాప్తులను పూర్తి చేయనుంది.

ఈలోగా ఆశ్చర్యకర పరిణామం చోటు చేసుకుంది. ఎఎఐబి ఏ లక్ష్యాలనైతే పేర్కొందో దాదాపుగా అవే లక్ష్యాలతో అంటే ప్రమాదానికి మూల కారణాన్ని నిర్ధారించడం కోసం హోం కార్యదర్శి అధ్యక్షతన భారత ప్రభుత్వం 'ఉన్నత స్థాయి కమిటీ' (హెచ్ఎల్‌సి)ని ఏర్పాటు చేసింది. బ్లాక్ బాక్స్‌లను స్వాధీనపరుచుకోవడం, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు జరపడం వంటి ఈ కమిటీ ఇతర లక్ష్యాలు కూడా దాదాపుగా అలాగే వున్నాయి. ఉన్నత స్థాయిలో అధికారులతో కూడిన ప్రభుత్వ దర్యాప్తు కమిటీని ఇలా సమాంతరంగా ఏర్పాటు చేయడం వల్ల ఎఎఐబి దర్యాప్తుకు విఘాతం కలుగుతుంది. పైగా ఈ దర్యాప్తు ప్రక్రియలో ఐసిఎఒ అనెక్స్ 13 కింద ఎఎఐబిని ఏర్పాటు చేయడం యొక్క ప్రధాన ఉద్దేశ్యమైన ప్రభుత్వ జోక్యం గురించి సందేహాలు తలెత్తుతాయి.

ఎఎఐబి దర్యాప్తు పరిధిలో వున్న అంశాలను ముఖ్యంగా విమాన ప్రమాదానికి దారి తీసిన కారణాలు, పరిస్థితులపై విచారణలో లోటుపాట్లు తొలగించి తక్షణమే హెచ్ఎల్‌సి విచారణాంశాలను సవరించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ప్రమాదంపై దర్యాప్తును వృత్తిపరమైన నిపుణులకు విడిచిపెట్టడమే మంచిది. దీనికి బదులుగా విమానాశ్రయాలకు అత్యంత సమీపంలో నిర్దేశిత దూరంలో నివాస సముదాయాలు, భవంతులను నిర్మించకుండా తగు భద్రతా ప్రమాణాలను పాటించేలా చూసేందుకు నిబంధనలు, యంత్రాంగాలు రూపొందించాలని, వాటిని కఠినంగా అమలు చేయాలని ఇందుకు గానూ అహ్మదాబాద్, ఇతర విమాన ప్రమాదాల దర్యాప్తు నివేదికలను హెచ్ఎల్‌సి పరిశీలించాలని సిపిఎం కోరింది. అహ్మదాబాద్ ఘటనలో కింద క్షేత్ర స్థాయిలో మరిన్ని మరణాలు సంభవించేందుకు అవకాశం చాలా వుంది. అయితే, అక్కడ పెద్ద ఎత్తున వైద్య సదుపాయాలు కూడా వున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్దిష్ట చర్యలు తీసుకోవడం చాలా అవసరమని సిపిఎం స్పష్టం చేసింది.

విమాన ప్రమాద మృతదేహాలు 64 అందచేత

అహ్మదాబాద్ : ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డీఎన్ఏ పరీక్ష ద్వారా సోమవారం వరకూ 99 మృతదేమాలను అధికారులు గుర్తించారు. వీటిలో 64 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారంతా ఖేడా, అహ్మదాబాద్, కోట, మహేసానా, భరూచ్, వడోదర, అరవల్లి, ఆనంద్, జునాగఢ్, భావ్‌నగర్, అమ్రేలి, మహిసాగర్, భావ్‌నగర్‌కు చెందిన వారిగా అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ తెలిపారు.

గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలిపోయింది. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో విజయ్ రూపానీ అంత్యక్రియలు

విమాన ప్రమాదంలో చనిపోయిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ అంత్యక్రియలను సోమవారం రాజ్‌కోట్‌లో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థంగా ఒకరోజు రాష్ట్ర సంతాప దినంగా సర్కార్ ప్రకటించింది. విజయ్ రూపానీ అంత్యక్రియలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు ప్రముఖులు హాజరయ్యారు...

ఉద్రిక్తతలపైనే చర్చ!

(మొదటి పేజీ తరువాయి)

ముగించుకుని ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం సాయంత్రానికి కెనడా చేరుకున్నారు. అక్కడ జి-7 సదస్సులో ఆయన పాల్గొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ హాజరయ్యారు. దశాబ్దకాలంలో మోడీ కెనడాలో తొలిసారిగా పర్యటిస్తున్నారు.

కాగా కొత్త ఆయుధాల కొనుగోలుపై జెలెన్స్కీ, ట్రంప్‌తో చర్చించనున్నారు. మంగళవారం సదస్సుకు హాజరు కానున్న జెలెన్స్కీ, ఉక్రెయిన్ కొనుగోలు చేయనున్న రక్షణ ప్యాకేజీపై చర్చించనున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధంపై మంగళవారం ప్రధానంగా చర్చ జరుగుతుందని భావిస్తున్నారు. ఇదిలా వుండగా, కెనడా ప్రధాని మార్క్ కార్నేతో సోమవారం ఉదయం ట్రంప్ భేటీ అయ్యారు. వాణిజ్యం, భద్రతపై ప్రధానంగా చర్చలు జరుగుతాయని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌తో భేటీ అయ్యారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ అందరికన్నా ముందుగానే కనానాస్కిస్ చేరుకున్నారు.

ఖలిస్తానీల నిరసనలు

ప్రధాని మోడీతో సహా ప్రపంచ నేతలు సమావేశమవుతున్న వేళ నిరసనలు, ఉద్రిక్తతలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని మోడీకి నిరసన తెలియచేసేందుకు వందలాదిమంది ఖలిస్తానీలు అల్బర్టా చేరుకుంటున్నారు. ఇందుకు గానూ వారు వస్తున్న వాహనాల కాన్వాయ్ దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. 'పొంచి వుండి మోడీపై దాడిచేయడానికి, ప్రధాని మోడీ రాజకీయాలను నాశనం చేసేందుకు తాను సిద్ధంగా వున్నానని నిరసన నేతల్లో ఒకరైన మన్‌జిందర్ సింగ్ వ్యాఖ్యానించారు. సిక్స్ ఫర్ జస్టిస్ అనే సంస్థ ఈ నిరసనలను చేపట్టింది.

రెండు దశల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదు చేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. సమాచార సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు పేర్కొంది. 1948 నాటి జనగణన చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జన-కులగణనను చేపట్టనున్నట్లు వివరించింది. ఇక 2021లో జనగణన కోసం ప్రభుత్వం రూ.12,695.58 కోట్లను కేటాయించగా.. ఈసారి జనగణనకు రూ. 13 వేల కోట్ల వరకూ వ్యయం అయ్యే అవకాశం ఉండగా.. ప్రస్తుతానికి కేంద్రం 2025-26 బడ్జెట్‌లో కేవలం రూ. 574.80 కోట్ల నిధులను మాత్రమే కేటాయించింది.

16 ఏళ్ల తరువాత..

దేశంలో జనగణనను పదేళ్లకోసారి నిర్వహిస్తారు. చివరిసారిగా 2011లో ఈ ప్రక్రియను చేపట్టారు. రెండు విడుతల్లో ఈ ప్రక్రియ జరిగింది. వాస్తవానికి 2021లోనే జన గణనను నిర్వహించాలి. అయితే, కరోనా కారణంగా ఈ ప్రక్రియ వాయిదా పడింది. ఇప్పుడు 16 ఏళ్ల తరువాత తొలిసారిగా జనాభా గణనను నిర్వహించనున్నారు. దీంతోపాటు తొలిసారిగా కులగణనను కూడా చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటే కులగణనను కూడా చేపట్టనున్నట్టు గత నెలలో కేంద్రం వెల్లడించడం తెలిసిందే. కాగా జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి ఇప్పటికే 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అందులో ఓ కొత్త ప్రశ్న కూడా ఉంది. అదే ఈ జనగణన ప్రత్యేకత.

దేశంలో 1872 నుంచి జనగణన చేస్తున్నారు. జనాభా లెక్కల సేకరణలో భాగంగా 1931 నుంచి ఒకే విధమైన ప్రశ్నలే అడుగుతూ వస్తున్నారు. అయితే 1951 నుంచి ఇప్పటి వరకు అడగని ఒక ప్రశ్న ఈసారి జనగణనలో అడుగుతారు. అదే మీ కులం ఏంటి? అని. ఇందులో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల గురించి సమాచారం ఇంతకు ముందే ఉంది. అయితే ఈసారి జనగణనలో ప్రతి ఒక్కరికీ తమ కులం గురించి చెప్పే ఆప్షన్ ఉంటుంది. జనాభా లెక్కల సేకరణలో ఈసారి వస్తున్న పెద్ద మార్పు ఇదే. 1931 తర్వాత ఇప్పుడు జనగణన, కులగణనను ఒకేసారి చేపడుతున్నారు.

జనగణన అంటే ఏంటి?

ఒక దేశం లేదా ఒక ప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక సమాచారాన్ని సేకరించడం, సంకలనం చేయడం, విశ్లేషించడం, ఆ తర్వాత దాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవడాన్ని జనగణన అని అంటారు. జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజల వయసు, లింగం, భాష, మతం, విద్య, వత్తి, ఎక్కడ నివసిస్తున్నారనే వివరాలు సేకరించనున్నారు. ఈ గణాంకాల ఆధారంగా ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలను రూపొందిస్తారు.

జీవన సౌరభం

విద్య, వివేకం, పరిజ్ఞానం బావిలో నీళ్లలాంటివి. వాడుతున్న కొద్దీ ఊరుతూనే ఉంటాయి.

మీకోసం

అల్లంతో చేసిన టీని వేడిగా తాగడం వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

ధర్మయ్య మంచితనం

సీతాపురంలో ఉండే పూలతోట యజమాని భూషయ్య దగ్గర భీమయ్య, ధర్మయ్యలు పనిచేస్తున్నారు. భీమయ్య ఎప్పుడూ వారి మీద, వీరి మీద లేని పోనివి చెబుతుంటాడు. ధర్మయ్య అంటే కూడా సరిపోయేది కాదు. కానీ ధర్మయ్య ఇవేవీ పట్టించుకునేవాడు కాదు. భూషయ్యకు చుట్టుపక్కల ఊర్లలో ఎంతో మంచి పేరు ఉంది. పండుగలకు దేవాలయాలకు ఉచితంగా పూలను పంపిణీ చేస్తాడు.

ప్రక్క గ్రామాలైన పార్వతీపురం, కృష్ణాపురంలో ఉన్న రెండు అనాథ శరణాలయాలకు భూషయ్య ప్రతి నెలా బస్తా బియ్యం విరాళంగా ఇస్తాడు. ఒక నెల బంధువుల పెళ్లి పనుల వల్ల ఆ రెండు గ్రామాలకు మంచిరకం బియ్యం అందించమని భీమయ్య, ధర్మయ్యలకు చెరి రెండు వేలు ఇచ్చి పంపించాడు. భీమయ్య రెండవ రకం బియ్యం కొంటే ధర్మయ్య మేలు రకం బియ్యాన్ని కొని అనాథ శరణాలయాలకు ఇచ్చి వచ్చారు.

మూడు రోజుల తరువాత పార్వతీపురం శరణాలయం నుండి భూషయ్యకు 'ఈ సారి మీరు అందించిన బియ్యం బాగు లేవు. ఎక్కువగా రాళ్లు ఉన్నాయి' అని ఉత్తరం అందింది. ఆ రోజు భీమయ్య పనిలోకి రాకపోవడంతో ధర్మయ్యను పార్వతీపురం వెళ్లి బియ్యం విషయం చూడమన్నాడు భూషయ్య. శరణాలయం కోసం భీమయ్య రెండవ రకం బియ్యం పద్దెనిమిది వందలకు ఒక వ్యాపారి నుండి కొనుగోలు చేశాడని ధర్మయ్య విచారణలో తేలింది.

ధర్మయ్య ఇంకేం ఆలోచించకుండా శరణాలయం నుండి ఆ బియ్యం బస్తాను తెచ్చి మిగతా రెండు వందలు ఇచ్చి మంచి బియ్యం



బస్తాను వారికి ఇచ్చాడు. భూషయ్యకు ఇవేమీ చెప్పకుండా 'బియ్యం మార్చి, మంచి బియ్యం అందించాను' అని చెప్పాడు.

మరుసటి రోజు భూషయ్య, భీమయ్యతో బియ్యం గురించి చెప్పాడు. 'ధర్మయ్య వెళ్లి సరిచేశాడు. ఇంకోసారి ఇలా జరగ కూడదు' అని మందలించాడు. భీమయ్యకి అసలు విషయం అర్థమైంది. తక్కువ డబ్బులకి కొనుగోలు చేశానన్న విషయం చెప్పకుండా ధర్మయ్య తనని కాపాడాడని తెలుసుకున్నాడు. ధర్మయ్య దగ్గరికి వెళ్లి కృతజ్ఞతలు చెప్పాడు. 'ఒకే దగ్గర కొలువు చేస్తున్నాము నిన్ను ఆదుకోవడం నా ధర్మం. అయితే ఇంకెప్పుడూ ఇలా చేయకు' అన్నాడు ధర్మయ్య. 'నేను చేసిన తప్పు తెలియకుండా నన్ను కాపాడావు. ఇక మీదట తప్పుడు పనులు చేయను' అన్నాడు భీమయ్య.

- యు.విజయశేఖర రెడ్డి,
హైదరాబాద్.

నేను గీసిన బొమ్మ

లక్షణ్,
4వ తరగతి,
సెయింట్ఆన్స్ స్కూల్,
పేరాల, చీరాల.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడి: chinnaarips@gmail.com

పిల్లలు మారాం చేయకుండా ఉండాలంటే...

మళ్లీ పాఠశాలలు తెరచుకున్నాయి. వేసవి సెలవుల్లో సరదాగా గడిపిన పిల్లలు మళ్లీ ఒక్కసారిగా పాఠశాలలకు వెళ్లాలంటే కొద్దిగా మారాం చేస్తుండటం సహజం. పిల్లలన్నాక మారాం చేయకుండా ఉంటారా?. చేస్తుంటారు. అయినా మనం వారిని 'నానా..కన్నా..బుజ్జి' అంటూ సతాయించి మళ్లీ బడికి పంపించేందుకు ప్రయత్నించాల్సిందే. ఇన్నాళ్లు వేసవి కాలమంతా ఇంట్లోనే ఉండి అమ్మమ్మలు, నానమ్మలు, బంధువులు, స్నేహితులతో పిల్లలు ఆనందంగా, హాయిగా గడిపేశారు. వేసవి సెలవులు అయిపోయాయి నాన్నా..పాఠశాలలు తెరిసి కొన్నిరోజులు అవుతోంది. అయినా పిల్లలు కొంచెం బద్ధకంగా ఉంటూ మారాం చేస్తుండటం చూస్తుంటుంటాం. మా బుజ్జి కదు..మా కన్న చెప్పినమాట వింటాడు..అంటూ వారిని బుజ్జగించి స్కూలుకు పంపటం మినహా మరో గత్యంతరం లేదు. ఇంతకాలం బాగా ఎంజాయ్ చేసిన పిల్లలు ఇప్పుడు ఒక్కసారిగా బడికి వెళ్లాలంటే కొన్ని ఇబ్బందులు పడుతుంటారు. ఇప్పటికే చూస్తే మొదటి రెండ్రోజులు చాలా తక్కువ మంది పిల్లలే పాఠశాలల్లో కన్పిస్తున్నారు. ప్రస్తుతానికి అరపూట తరగతులే ఉంటున్నాయి. వేసవిలో ఆలస్యంగా నిద్ర లేవడం, ఇంట్లో పిల్లలతో ఆడుకోవడం, నచ్చినవి తినడం చేశారు. ఇలా అలవాటు పడిన పిల్లలను పాఠశాలకు పంపే ఈ సమయంలోనే పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ముందు మానసికంగా ఇప్పటికే సంసిద్ధులను చేశారు. మరికొన్ని రోజులు ఇలా చేయాల్సిందే. తద్వారా వారు పాఠశాలకు వెళ్లే విధంగా వారిని ప్రోత్సహించాలి.

టైంషెడ్యూల్ మేలు

పిల్లలు బడికి అలవాటు అవ్వాలంటే ముందుగా వారికి సమయ పాలన అలవాటు చేయాలి. రోజులో ఉండే 24 గంటల్లో ఉదయం నుంచి రాత్రి వరకూ

చేయాల్సిన, పాటించాల్సిన విధులు, పనుల గురించి తెలియజేయాలి. తద్వారా వారు సమయపాలనకు అలవాటు పడుతుంటారు. ఉదయం నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకోవటం, కాసేపు చదువుకోవటం, ఆడుకోవడం, హోంవర్క్ చేయడం, కుటుంబ సభ్యుల కోసం కాస్త సమయం.. ఇలా వాళ్లు చేసే కార్యకలాపాలన్నింటికీ సమయం కేటాయిస్తూ ఒక నెల రోజుల పాటు సమయపాలన నిర్ణయించి అమలు చేస్తే పిల్లలు దారిలోకి వస్తారు. పిల్లలు స్కూలు నుంచి రాగానే కడుపు ఖాళీ అయ్యి ఆకలితో ఉంటారు. వారికి అల్పాహారం ఏర్పాటుచేస్తే తినేసి ఎంచక్కా ఉత్సాహంతో ఉంటారు. ఏరోజుకారోజు ఈ రోజు స్కూలులో ఏమి పాఠాలు చెప్పారు? హోమ్ వర్కులు వంటివి ఇచ్చారా? ప్రాజెక్టు డ్రాయింగ్స్ వంటివేమైనా ఉన్నాయా? అనేది ఒక్కసారి అడిగితే మేలు. ఇంకా మాకు చెప్పాల్సిన విషయాలేమైనా ఉన్నాయా? అంటూ అడిగి తెలుసుకోవాలి. చిన్న గణిత ప్రక్రియలు చేయించడం, కథలు చదివించడం, దినపత్రికలు చదివించడం చేయాలి. పిల్లలకు కఠినంగా ఉండే అంశాల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధతో సహాయ సహకారాలు అందించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పి ఒత్తిడి లేకుండా చూడాలి. ఇలా చేస్తే పిల్లలు త్వరగా బడికి అలవాటు పడిపోతారు. పిల్లలకు వారి స్థాయిలో ఎంపిక చేసుకోనివ్వాలి.

ఇష్టా ఇష్టాలను తెలుసుకోవాలి : పిల్లలను అస్తమానం సతాయించకుండా వారికి కూడా లోకజ్ఞానం తెలిసేలా ప్రోత్సహించాలి. బయట మార్కెట్లకు తీసుకెళ్లటం, వాటి ధరలు తెలియజేయటం, ఇంట్లో జరిగే ఖర్చులు, ఆర్థిక వ్యవహారాలపై అవగాహన కల్పించటం వంటివి కూడా చేయాలి. మీ పిల్లలకు అవసరమైన పాఠశాల సామాగ్రి, పుస్తకాలు, బూట్లు, యూనిఫారాల జాబితాను ముందుగానే రూపొందించుకోవాలి. పిల్లలను షాపింగ్‌కు తీసుకుని వెళ్లి అవసరమైనవి, అనుగుణమైనవి వారినే సెలెక్ట్ చేసుకోనివ్వాలి.

ఇష్టా ఇష్టాలను గౌరవించాలి : ఖాళీ సమయాల్లో వారేం చేయాలనుకుంటున్నారో ముందుగా వారినే అడగాలి. వారి అభిరుచులు, ఆసక్తులను తెలుసుకోవాలి. వారికి ఏయే అంశాల్లో నైపుణ్యం ఉందో అవగాహన చేసుకోవాలి. ఆటలు, పాటలు, డ్యాన్సులు, చిత్రలేఖనం, ఏమైనా సంగీత వాయిద్యాలు వాయించడాన్ని ఇష్టపడితే ఆయా అంశాల్లో సమయాన్ని బట్టి శిక్షణను ఏర్పాటు చేస్తే వారిలో మానసికోల్లాసం కలుగుతుంది. కంప్యూటర్ కోర్సులు వంటివి నేర్పించాలి.

ఆరోగ్యంపై పట్ల శ్రద్ధ అవసరం : అధిక ప్రోటీన్ కలిగిన అల్పాహారం ఇచ్చి పిల్లలను బడికి పంపాలి. అది వారి శారీరక, మానసిక బలాన్ని మరింత బలపరుస్తుంది. వారు ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇచ్చేందుకు ప్రిఫర్ చేయాలి. మంచినీరు ఎక్కువ త్రాగేలా వారిని ప్రోత్సాహించాలి. కొత్త విద్యా సంవత్సరానికి పిల్లలను అలవాటు చేయడం కాస్త కష్టమే అయినప్పటికీ.. పైన చెప్పినవన్నీ ఫాలో అయితే త్వరగా అలవాటు పడిపోతారు. అలాగే స్కూళ్లో వారు సాధించిన విజయాలను సెలబ్రేట్ చేస్తే వారిలో ఆత్మవిశ్వాసం మరింతగా పెరుగుతుంది.

- అలవాల సుందరయ్య,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
గంగినేని గ్రామం,
జి.కొండూరు మండలం,
ఎన్‌టిఆర్‌జిల్లా.
సెల్ : 8985349510

ఇవి పాటించటం కూడా మంచిదే.

- కరోనా భయం మళ్లీ వెంటాడుతున్నందున వీలైతే మాస్కులు వంటివి ధరింపజేయటం
- శారీరకంగా వ్యక్తిగత శుభ్రతతోపాటుగా ఇంట్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వటం
- వేసవిలో పిల్లలు ఫోన్‌కు అలవాటు పడిపోయివుంటారు. స్కూలు నుంచి రాగానే ఫోన్ కోసం పట్టుబడుతుంటారు. ఒకేసారి ఇవ్వనని చెప్పకుండా ముందుగా హోంవర్క్, చదవాల్సిన సబ్జెక్టలను పూర్తిచేస్తే ఇస్తానని చెప్పాలి.
- ఫోన్‌ను ఎక్కువ సేపు వాడితే వచ్చే దుష్ఫలితాల గురించి తెలియజేయాలి.
- చదువుతోపాటుగా ఆటల్లో కూడా ప్రోత్సహించాలి.
- హోంవర్క్ పూర్తయిన తరువాత ఎక్కువ సమయం క్రీడలకు కేటాయించేలా ప్రోత్సహించాలి. ఇది శారీరక దృఢత్వానికి దోహదపడుతుంది.
- పిల్లలు రాత్రిళ్లు ఎక్కువ సేపు టివికి అతుక్కుపోకుండా త్వరగా నిద్రపోయే విధంగా చూడాలి.
- వేకువ జామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని చదువుతోపాటు, ఆటలు, ధ్యానం వంటివి చేయిస్తే ఇంకా ఆనందంగా ఉంటారు. భావి భారత పౌరులైన పిల్లల విషయంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి.

భారత్ తొలి ప్రత్యర్థి శ్రీలంక

- సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే ప్రపంచ కప్
- షెడ్యూల్, వేదికలను ప్రకటించిన ఐసిసి

దుబాయ్: మహిళల వన్డే ప్రపంచ కప్ షెడ్యూల్, వేదికలను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) సోమవారం విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ తొలి రోజే టీమిండియాజట్టు శ్రీలంకతో తలపడనుంది. అయితే.. ఇక భారత్ × పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే అక్టోబర్ 5న కొలంబో వేదికగా జరగనుంది. పాకిస్తాన్ జట్టు భారత వేదికల్లో ఆడడానికి నిరాకరించడంతో ఆ జట్టు ఆడే మ్యాచ్‌లన్నీ కొలంబోలో జరగనున్నాయి. కొలంబో వేదికగా మొత్తం 11 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నట్లు తాజాగా ఐసిసి ప్రకటించింది. ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. టైటిల్ ఫేవరెట్ దేశాల్లో టీమిండియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 30న జరిగే తొలిపోరులో శ్రీలంకతో టీమిండియా పోరుతో తలపడనుంది. అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. అక్టోబర్ 29న కొలంబో లేదా

బెంగళూరులో తొలి సెమీ ఫైనల్ జరుగనుండగా.. అక్టోబర్ 30న బెంగళూరులో రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఉండనుంది. టైటిల్ విజేతను నిర్ణయించే ఫైనల్ పోరు నవంబర్ 2న జరుగనుంది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుందని ఐసిసి వెల్లడించింది.

షెడ్యూల్...

సెప్టెంబర్ 30 : భారత్ × శ్రీలంక :బెంగళూరు)
అక్టోబర్ 1 : ఆస్ట్రేలియా × న్యూజిలాండ్ (ఇండోర్)
2 : బంగ్లాదేశ్ × పాకిస్థాన్ (కొలంబో)
3 : ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా (బెంగళూరు)
4 : ఆస్ట్రేలియా × శ్రీలంక (కొలంబో)
5 : భారత్ × పాకిస్థాన్ (కొలంబో)
6 : న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా (ఇండోర్)
7 : ఇంగ్లండ్ × బంగ్లాదేశ్ (గౌహతి)
8 : ఆస్ట్రేలియా × పాకిస్థాన్ (కొలంబో)
9 : భారత్ × దక్షిణాఫ్రికా (విశాఖ)
10 : న్యూజిలాండ్ × బంగ్లాదేశ్ (విశాఖ)
11 : ఇంగ్లండ్ × శ్రీలంక (గౌహతి)
12 : భారత్ × ఆస్ట్రేలియా (విశాఖ)
13 : దక్షిణాఫ్రికా × బంగ్లాదేశ్ (విశాఖ)
14 : న్యూజిలాండ్ × శ్రీలంక (కొలంబో)
15 : ఇంగ్లండ్ × పాకిస్థాన్ (కొలంబో)
16 : ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్ (విశాఖ)
17 : దక్షిణాఫ్రికా × శ్రీలంక (కొలంబో)
18 : న్యూజిలాండ్ × పాకిస్థాన్ (కొలంబో)
19 : భారత్ × ఇంగ్లండ్ (ఇండోర్)
20 : శ్రీలంక × బంగ్లాదేశ్ (కొలంబో)
21 : దక్షిణాఫ్రికా × పాకిస్తాన్ (కొలంబో)
22 : ఆస్ట్రేలియా × ఇంగ్లండ్ (ఇండోర్)
23 : భారత్ × న్యూజిలాండ్ (గౌహతి)
24 : పాకిస్థాన్ × శ్రీలంక (కొలంబో)
25 : ఆస్ట్రేలియా × శ్రీలంక (ఇండోర్)
26 : ఇంగ్లండ్ × న్యూజిలాండ్ (గౌహతి)
26 : భారత్ × బంగ్లాదేశ్- బెంగళూరు
29 : సెమీ ఫైనల్ 1 (గువాహటి/కొలంబో)
30 : సెమీ ఫైనల్ 2 (బెంగళూరు/కొలంబో)
నవంబర్ 2 : ఫైనల్ (కొలంబో/బెంగళూరు)

మరో వివాదంలో అశ్విన్

- ఈసారి బాల్ ట్యాంపరింగ్

చెన్నై: భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వరుసగా వివాదాల్లో నిలుస్తున్నాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్(టిఎన్‌పిఎల్) 9వ సీజన్‌లో మహిళా అంపైర్‌తో గొడవ పడిన అశ్విన్.. వారం తిరగకుండానే తాజాగా మరోసారి వివాదంలో చిక్కుకున్నాడు. ఈసారి బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. టిఎన్‌పిఎల్‌లో దుండిగల్ డ్రాగన్స్‌కు కెప్టెన్‌గా ఉన్న అశ్విన్ బంతి స్వరూపాన్ని మర్చేందుకు ప్రయత్నించాడని సైచెమ్ మధురై పాంథర్స్ జట్టు ఫిర్యాదు చేసింది. జూన్ 14న సేలంలోని ఎస్‌సీఎఫ్ క్రికెట్ మైదానంలో దుండిగల్, మధురై పాంథర్స్ తలపడ్డాయి. అయితే.. ఈ మ్యాచ్‌లోనే అశ్విన్, అతడి జట్టు సభ్యులు బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డారని మధురై పాంథర్స్ యాజమాన్యం టిఎన్‌పిఎల్ నిర్వాహకులకు లేఖ రాశారు. అయితే.. టిఎన్‌పిఎల్ సిఈఓ ప్రసన్న కన్నన్ మాత్రం బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలపై స్పందిస్తూ.. అశ్విన్, జట్టు సభ్యులు ఈ నేరానికి పాల్పడ్డారనడానికి తగిన ఆధారాలను సమర్పించాలని మధురై పాంథర్స్‌ను ఆదేశించారు.

టాప్-5లో టేలర్ ఫ్రిట్జ్

- ఎటిపి ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఎటిపి) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్ సత్తా చాటాడు. ఎటిపి సోమవారం వెల్లడించిన ర్యాంకింగ్స్‌లో ఫ్రిట్జ్ ఏకంగా 3స్థానాలు మెరుగుపరుచుకొని నాల్గోస్థానంలో నిలిచాడు. టాప్‌లో ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్(10,880పాయింట్లు) ఉండగా.. 2వ స్థానంలో ఫ్రెంచ్ ఓపెన్ విజేత అల్కరాజ్(8,850) ఉన్నాడు. ఇక జ్వెరేవ్(జర్మనీ) 6,500పాయింట్లు, టేలర్ ఫ్రిట్జ్ 3స్థానాలు మెరుగుపరుచుకొని 4,735పాయింట్లతో 4వ స్థానంలో నిలిచాడు. గత వారం జరిగిన స్టట్‌గార్ట్ టోర్నీలో ఫ్రిట్జ్ 3వ సీడ్ జ్వెరేవ్‌ను ఓడించాడు. దీంతో ఫ్రిట్జ్ తిరిగి టాప్-5లో చోటు దక్కించుకున్నాడు. 27ఏళ్ల అమెరికాకు చెందిన ఫ్రిట్జ్ కెరీర్ అత్యధిక ర్యాంక్ ఇదే. ఫ్రెంచ్ ఓపెన్ తొలిరౌండ్‌లో డేనియల్ అల్ట్‌మేయర్ చేతిలో ఓడిన ఫ్రిట్జ్ 7వ స్థానానికి పడిపోయాడు. దీంతో గత వారంలో 4వ స్థానంలో ఉన్న జాక్ డ్రేపర్ 6వ స్థానానికి పడిపోగా.. ఇక ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనలిస్ట్ అమెరికాకు చెందిన బెన్ షెల్టన్ కెరీర్ బెస్ట్ టాప్-10లో నిలిచాడు.

ఎటిపి ర్యాంకింగ్స్..

1. జెన్నిక్ సిన్నర్(ఇటలీ) : 10,880పాయింట్లు
2. కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్) : 8,850 ,,
3. అలెగ్జాండర్ జ్వెరేవ్(జర్మనీ) : 6,500 ,,
4. టేలర్ ఫ్రిట్జ్(అమెరికా): 4,735(+3)
5. నొవాక్ జకోవిచ్(సెర్బియా) : 4,630 ,,
6. జాక్ డ్రాపర్ (బ్రిటన్) : 4,550(-2) ,,
7. లొరెంజో మసెట్టి(ఇటలీ) : 4,470(-1) ,,
8. టోమీ పాల్(అమెరికా) : 3,470 ,,
9. హోల్గర్ రూనే(డెన్మార్క్) : 3,440 ,,
10. బెన్ షెల్టన్(అమెరికా) : 3,170(+2)
11. మెద్వదెవ్(రష్యా) : 3,140
12. అలెక్స్-డీ-మినర్(ఆస్ట్రేలియా): 3,085 ,,
13. ఫ్రాన్సిస్ టఫీ(అమెరికా) : 2,990 ,,
14. ఆండ్రీ రుబ్లేవ్(రష్యా) : 2,920 ,,
15. ఆథర్ ఫైల్స్ (ఫ్రాన్స్) : 2,920 ,,

Ministry of Ayush, Government of India

ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా

11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం

భారతదేశం అంతటా లక్ష ప్రదేశాలు
ప్రపంచవ్యాప్తంగా 175 + దేశాలు
యోగా జరుపుకుంటున్నారు!

మీ దగ్గరలోని # IDY2025 కార్యక్రమంలో పాల్గొనండి!

యోగాను స్వీకరించండి :
రోగనిరోధక శక్తిని పెంచండి, ఒత్తిడిని తగ్గించండి
సామరస్యం వైపు ఒక అడుగు
నివారణ సంరక్షణ, జీవితకాల లాభాలు

యోగ సంగమం కోసం రిజిస్టర్ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయండి

Yoga Sangam

జాతీయ కార్యక్రమం: విశాఖపట్నం | 21 జూన్ 2025

#IDY2025

cbc 17201/13/0004/2526

యోగాను ఎంచుకోండి. శ్రేయస్సును ఎంచుకోండి. పర్యావరణాన్ని రక్షించండి

moayush | ministryofayush | MinistryofAyushofficial

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68